

నరసాపూర్-ధర్మవరం ఎక్స్‌ప్రెస్‌కు
## తప్పిన ప్రమాదం
- పాక్షికంగా విరిగిన రైలు పట్టా
- గమనించిన కీమన్
- ఎర్రజెండాతో రైలుకు ఎదురెళ్లిన వైనం
- నిదానంగా దాటిన ఎక్స్‌ప్రెస్
7



ముగ్గులు వేస్తున్న మహిళలు, యువతులు

# మురిపించిన ముగ్గులు

అనంతపురం కల్చరల్/హిందూపురం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజీ మైదానం రంగులమయమైంది. ముత్యాల ముగ్గులకు వేదికగా మారి మురిసిపోయింది. తెలుగింటి సంప్రదాయ కళను ప్రదర్శించేందుకు మహిళలు, యువతులు పోటీ పడ్డారు. ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహించిన సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు... గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పెర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా(ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్)కు విశేష స్పందన లభించింది. అనంతపురం అర్బన్ బ్యాంక్ చైర్మన్ జేఎల్ మురళీధర్ స్థానికంగా సహకారం అందించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 105 మంది మహిళలు, యువతులు పోటీల్లో పాల్గొన్నారు. రంగు రంగుల ముగ్గులతో ఆకట్టుకున్నారు.

## ● నేడు హిందూపురంలో..

● హిందూపురం పట్టణంలోని ఎంజీఎం క్రీడామైదానంలో ఆదివారం ముత్యాల ముగ్గుల పోటీలు జరగనున్నాయి. ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్ట్‌నర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్ వేర్)లో పాల్గొనేందుకు మహిళలు సిద్ధమయ్యారు. ముగ్గుల పోటీలు ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయి. వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ బేవనహళ్లి ఆనంద్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరవుతారు. న్యాయ నిర్ణేతలు.. విజేతలను ఎంపిక చేస్తారు. విజేతలకు బేవనహళ్లి ఆనంద్‌కుమార్ బహుమతులను ప్రదానం చేస్తారు.



రంగులు సరి చూసుకుంటున్న యువతులు

- గత వైసీపీ పాలకుల పాపం
- మంచినీటి సరఫరాకు మంగళం
- బిల్లులు అందక నిర్వహణను వదిలేసిన ఏజెన్సీ
- ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాలకు ఆగిన నీరు
- ప్రజలను వెంటాడుతున్న రోగాల భయం
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు




మంచినీటి పథకం

# మళ్లీ.. ఫ్లోరైడ్ కోరల్లోకి..!

గత వైసీపీ పాలకుల పాపం.. ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాల ప్రజలకు శాపంగా మారింది. నీటిలోని ఫ్లోరైడ్ మనిషి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నట్లు గతంలో నిపుణులు గుర్తించారు. ఆ నీరు తాగకుండా, వినియోగించకుండా మంచినీరు సరఫరా చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించడానికి రూ.కోట్లు ఖర్చు చేసి, నీటి పథకాలు నిర్మించారు. సుదూర ప్రాంతాల నుంచి మంచినీరు సరఫరా చేశారు. అలాంటిదే సమగ్ర మంచినీటి సరఫరా పథకం. అలాంటి పథకాన్ని సైతం గత వైసీపీ పాలకులు అటకెక్కించారు. పథకం నిర్వహణ ఏజెన్సీలకు బిల్లులు చెల్లించకుండా నిర్లక్ష్యం చేశారు. దీంతో ఏజెన్సీలు చేతులెత్తేశాయి. ఫలితంగా ప్రజలకు తాగునీరు అందక, ఫ్లోరైడ్ నీటినే వినియోగించాల్సి వస్తోంది. నాలుగేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొంది. ఇటీవల ఏర్పడిన కూటమి ప్రభుత్వంపై ఆశలు పెంచుకున్నారు. తాగునీరు సరఫరా చేయకపోతుందా అని ఎదురుచూస్తున్నారు.

- తనకల్లు (ఆంధ్రజ్యోతి)

### రూ.కోట్లు ఖర్చు పెట్టి..

కదిరి, తనకల్లు, నల్లచెరువు, గాండ్లపెంట, నంబులపూలకుంట, తలుపుల మండలాల పరిధిలో నీటిలో ఫ్లోరైడ్ అధికంగా ఉన్నట్లు అధికారులు గతంలో గుర్తించారు. ఫ్లోరైడ్ నిర్మూలనకు ఎంపిక చేసిన గ్రామాల్లో ప్రజలకు ఉచితంగా ప్రభుత్వం పిల్టర్లను కూడా సరఫరా చేసింది. కదిరి ప్రాంతంలో పలువురు ఫ్లోరైడ్ బారిన పడి చిన్న వయసులోనే కాళ్లు, చేతులు వంకర్లు పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను అప్పట్లో సత్యసాయిబాబా దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సత్యసాయిబాబా కోట్లాది రూపాయలు ఖర్చు చేసి, ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పార్నపల్లి డ్యాం నుంచి ఫ్లోరైడ్ రహిత మంచినీటిని కదిరి ప్రాంతానికి సరఫరా చేశారు. అందులో భాగంగా అనేక గ్రామాల్లో నీటి ట్యాంకులు నిర్మించారు. పార్నపల్లి నుంచి తనకల్లు వరకు నీటి సరఫరాకు ప్రభుత్వం ఎన్నోచోట్ల లిఫ్టులు ఏర్పాటు చేసింది. వాటి వద్ద సిబ్బందిని నియమించి, ఫ్లోరైడ్ గ్రామాలకు మంచినీటిని సరఫరా చేసింది. తనకల్లు మండలంలోనే సమగ్ర మంచినీటి పథకం ఫేస్-1, 2 ద్వారా వందకుపైగా గ్రామాలకు తాగునీరు అందేది.

### వైసీపీ హయాంలో నిర్వీర్యం

పార్నపల్లి నుంచి వస్తున్న ఫ్లోరైడ్ రహిత నీటిని కదిరి ప్రాంత ప్రజలు వరప్రసాదంగా భావించేవారు. అలాంటి మంచినీటి పథకంపై 2019లో ఏర్పడిన వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చూపింది. ఆ పార్టీ అధికారం చేపట్టిన ఏడాదికే పథకం మూతపడిపోయింది. పథకాన్ని నిర్వహించే ఏజెన్సీలకు బిల్లులు చెల్లించలేదు. దీంతో నిర్వహణ నుంచి ఏజెన్సీలు తప్పుకున్నాయి. అందులో పనిచేస్తున్న వందలాదిమంది సిబ్బందిని నీరు రాలేదన్న సాకు చూపి, తొలగించారు. వెరసి.. గ్రామాలకు ఫ్లోరైడ్ రహితనీటి సరఫరా ఆగిపోయింది. దీంతో ఆయా గ్రామాల్లోని ప్రజలు ప్రైవేటు నీటి ట్యాంకులపై ఆధారపడాల్సి వస్తోంది. తాగునీరు కొనుగోలు చేస్తూ.. ఇతర అవసరాలకు మాత్రం ఫ్లోరైడ్ నీటినే వాడుతున్నారు. ఐదేళ్లుగా తాగునీరు సరఫరా కాకపోవడంతో గ్రామాల్లో ప్రజలు పడుతున్న బాధలు వర్ణనాతీతం. నేటికి కదిరి మండలంలోని అలంపూర్, కుమ్మరవాండ్లపల్లి, కదిరి, గాండ్లపెంట మండలంలోని గాజులవారిపల్లి తండా, చామాలగొంది, నల్లచెరువు మండలంలోని జొగన్నపేట, నంబులపూలకుంట పరిధిలో మేకలచెరువు, గౌడుచెరువువాండ్లపల్లి, తలుపులతోపాటు ఆమండలంలోని గొల్లపల్లితండా, తనకల్లు మండలంలోని కోర్తికోట, మల్లిరెడ్డిపల్లి, బాబేనాయక్‌తండా గ్రామాల పరిధిలో నీటిలో ఫ్లోరైడ్ శాతం అధికంగా ఉన్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పరీక్షల ద్వారా గుర్తించారు. అయినా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకున్న పాపానపోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మూరుమూల గ్రామాలకు ఫ్లోరైడ్ రహిత నీరు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి పార్నపల్లి నుంచి తనకల్లు మండలంలోని వంద గ్రామాలకు ఫ్లోరైడ్ రహిత మంచినీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### ఫ్లోరైడ్ నీటినే వినియోగిస్తున్నాం



మా గ్రామంలో నీటిని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పరీక్షించి, ఫ్లోరైడ్ అధికంగా ఉన్నట్లు ధ్రువీకరించారు. ఆ నీటిని వినియోగించరాదు. తాగునీరు సరఫరా కాకపోవడంతో ఫ్లోరైడ్ నీటితోనే వంటలు వండుకుంటున్నాం. ప్రైవేటు వ్యక్తుల వద్ద నీటిని కొనుగోలు చేయలేని వారు ఫ్లోరైడ్ నీటినే తాగుతున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి తాగునీరు సరఫరా చేయాలి.

-నారాయణస్వామి, మల్లిరెడ్డిపల్లి, తనకల్లు మండలం

### కూటమి అధికారంలోకి రావడంతో ఆశ



మా గ్రామ పరిధిలో నీటిలో ఫ్లోరైడ్ అధికంగా ఉంది. అయినా గత్యంతరం లేక ఆ నీటినే వినియోగిస్తున్నాం. వైసీపీ పాలనలో గ్రామానికి తాగునీటి సరఫరా ఆగిపయింది. కూటమి అధికారంలోకి రావడంతో మారుమూల ప్రాంతమైన మా గ్రామానికి మంచినీరు అందుతుందన్న ఆశతో ఉన్నాం.

-మంజునాథ్, కోర్తికోట, తనకల్లు మండలం

### మూడు నెలల్లోపు తాగునీరు అందిస్తాం

తనకల్లు మండలంలో సమగ్ర మంచినీటి పథకం ఫేస్-1, 2 పరిధిలోని గ్రామాలకు మూడు నెలల్లోగా తాగునీరు సరఫరా చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. కొన్నిచోట్ల పైపులైన్ల మరమ్మతులు చేయాల్సి ఉంది. త్వరలోనే తాగునీరు అందిస్తాం.

-వెంకటేశ్వర్లు, డీఈ, ఆర్‌డబ్ల్యూఎస్, కదిరి

## ఆహార భద్రతతో కూడిన విద్యే లక్ష్యం

- విద్యార్థులను పస్తులు పెట్టిన జగన్: మంత్రి సవిత
- డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న మంత్రి సవిత

పెనుకొండ/పెనుకొండ టౌన్/పెనుకొండ రూరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు ఆహార భద్రతతో కూడిన నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. పెనుకొండ, రొద్దంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంపీ బీకే పార్థసారథితో కలిసి మంత్రి సవిత ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 475 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. తద్వారా పేద విద్యార్థులకు పస్తుల బాధలు తప్పుతాయన్నారు. విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు, బ్యాగులు, పంపిణీ చేశామన్నారు. వైసీపీ పాలనలో అప్పటి ముఖ్యమంత్రి జగన్.. ఐదేళ్లపాటు విద్యార్థులను పస్తులు పెట్టారన్నారు. పాఠశాలలకు వైసీపీ రంగులు వేయడంలో ఉన్న శ్రద్ధ విద్యార్థులకు భోజనం పెట్టడంలో లేదన్నారు. ఐదేళ్లపాటు భోజన పథకాన్ని నిలిపివేసి, విద్యార్థులను పస్తులు పెట్టారన్నారు. పిల్లల నోటికాడ కూడు లాగేసిన మూర్ఖుడు జగన్‌రెడ్డి అని మండిపడ్డారు. విద్యార్థుల ఆకలిని గుర్తించిన మంత్రి నారా లోకేశ్ భోజన పథకాన్ని ప్రారంభించారన్నారు. అనంతరం బీకే పార్థసారథి మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని రద్దు చేసి, పేద విద్యార్థుల కడుపు మాడ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం వారి బాధలను గుర్తించి, మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించిందన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మంత్రి, ఎంపీ భోజనం చేశారు. ఆయా కార్యక్రమాల్లో అధికారులు, కళాశాలల సిబ్బంది పాల్గొన్నారు.

## విమానాశ్రయానికి మెరుగైన భద్రత: కలెక్టర్

పుట్టపర్తిటౌన్, జనవరి4(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని శ్రీసత్యసాయి విమానాశ్రయానికి మెరుగైన భద్రత కల్పించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. విమానాశ్రయంలో శనివారం భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు విమానాశ్రయం భద్రత పట్ల అలసత్వం తగదన్నారు. అధికారులు, విమానాశ్రయ నిర్వాహకులు సహకరించుకోవాలని సూచించారు. అనంతరం విమానాశ్రయ సిబ్బంది ఏర్పాటుచేసిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను వీక్షించి, పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ శ్రీనివాసరావు, విమానాశ్రయ డైరెక్టర్ సాయినాథ్‌రెడ్డి, ఆర్డీఓ సువర్ణ, మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద, డీఎస్పీ విజయ్‌కుమార్, అగ్నిమాపక శాఖాధికారి సాదిక్ పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ శివనారాయణరెడ్డి

# స్వాహాపర్వం..!

- మరుగుదొడ్ల మాటున నిధులు మటాష్
- కొత్త బోర్లకు పాత మోటార్ల ఏర్పాటు
- విచారణలో అక్రమాలు బయటపడేనా?

చిలమత్తూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రజోపకార్యాలకు ఉపయోగించాల్సిన ప్రభుత్వ నిధులను యథేచ్ఛగా స్వాహా చేశారు. పంచాయతీ ప్రజాప్రతినిధికి కొందరు నాయకులు తోడై ప్రజల సొమ్మును మింగేశారు. స్థానిక పంచాయతీ నిధులు పక్కదారి పట్టిన విషయం బయటికి పొక్కడంతో శనివారం పెనుకొండ డీఎల్‌పీఓ శివనారాయణరెడ్డి విచారణ చేపట్టారు. పంచాయతీ కార్యాలయానికి చేరుకుని, రికార్డులను పరిశీలించారు.

**మరుగుదొడ్ల మాటున..**

మండలకేంద్రం సమీపాన ఓ దేవాలయం వద్ద నిర్మించిన మరుగుదొడ్లకు పంచాయతీ నిధులు డ్రా చేశారు. దేవాలయం వద్ద ఆలయ కమిటీ సొంత డబ్బుతో వాటిని నిర్మించింది. వాటికి పంచాయతీ నిధుల నుంచి రూ.3.5 లక్షలకు పైగా నిధులను డ్రాచేయడం గమనార్హం. మరుగుదొడ్ల పేరుతో డ్రా చేసిన సొమ్ము అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడి ఖాతాలోకి జమకావడం విశేషం.

**కొత్త బోర్లకు పాత మోటార్లు**

కొత్తగా బోరుబావులు తవ్వించి, వాటికి పాత మోటారు, పంపుసెట్లు ఏర్పాటుచేసి రూ.లక్షల్లో నిధులు స్వాహా చేసినట్లు ఆరోపణలున్నాయి. రూ.మూడు లక్షల వ్యయంతో పూర్తయ్యే బోరుబావికి ఏకంగా రూ.6.5 లక్షల వరకు నిధులను డ్రా చేయడం గమనార్హం. క్షేత్రస్థాయిలో బోరుబావులను పరిశీలిస్తే పాతమోటార్లు బయటపడతాయని ప్రజలు చెప్పుకుంటున్నారు. పాత పైపులు ఏర్పాటుచేసి, కొత్తవాటిని కొనుగోలు చేసినట్లు బిల్లులు స్వాహా చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో ఇటు ప్రజాప్రతినిధి, అటు అధికార పార్టీకి చెందినవారు ఉండటంతో విచారణ సజావుగా సాగేనా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. విచారణ క్షేత్రస్థాయిలో జరిగితేనే అక్రమాలు బయటపడతాయన్న వాదనలు వినిపిస్తున్నాయి.




అనుగ్రహభాషణం చేస్తున్న మంత్రాలయ పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థ స్వామి





హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న సంధ్యామూర్తి బృందం



హనుమాన్ చాలీసా పారాయణలో పాల్గొన్న విద్యార్థులు

# నమో వాయుపుత్రా..!

సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం


హనుమన్నామస్మరణతో మార్మోగిన అనంత

హాజరైన హంపి, మంత్రాలయ పీఠాధిపతులు



జై హనుమాన్..





అనంతపురం కల్చరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఏక కాలంలో 20వేల గొంతుకలు హనుమన్నామస్మరణ చేయడంతో అనంత నగరం భక్తిభావంతో పులకించింది. హనుమాన్ చాలీసా పారాయణ ప్రచార సమితి ఆధ్వర్యంలో శనివారం జిల్లాకేంద్రంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణ నిర్వహించారు. దాదాపు 150 ఆలయాల ప్రతినిధులు, ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలకు చెందిన ఆధ్యాత్మికవేత్తలు, జిల్లాలోని దాదాపు 60 పాఠశాలల విద్యార్థులు దాదాపు 20వేల మందితో ఆర్ట్స్ కళాశాల మైదానం కిక్కిరిసిపోయింది. హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతీ మహాస్వామి జ్యోతి ప్రజ్వలన చేశారు. రాజమహేంద్రవరం కమాండెంట్ ఎస్పీ డాక్టర్ కొండా నరసింహారావు దంపతులు దాదాపు రెండున్నర నిమిషాల పాటు నిర్విరామంగా శంఖం పూరించి హనుమాన్ చాలీసా పారాయణ ప్రారంభించారు. తొలుత నృత్యకళాకారులు హనుమాన్ చాలీసా సంగీతానికి శాస్త్రీయ నృత్యం చేస్తూ అలరించారు. అనంతరం సంగీత విద్వాంసురాలు సంధ్యామూర్తి బృందం హనుమాన్ చాలీసా పఠించగా వీరితోపాటు విద్యార్థులంతా సామూహికంగా చాలీసా పారాయణం చేశారు. తదనంతరం మంత్రాలయ రాఘవేంద్రస్వామి మఠాధిపతి సుబుదేంద్రతీర్థ స్వామి హాజరై అనుగ్రహభాషణం చేశారు. భక్తితత్వం, విశ్వాసం అంటే ఏమిటో హనుమంతుడు లోకానికి చాటిచెప్పారన్నారు. ఆయన చూపిన భక్తిభావాన్ని ప్రతిఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. మరో పీఠాధిపతి విద్యారణ్య భారతీస్వామి అనుగ్రహభాషణం చేస్తూ హనుమాన్ చాలీసా పారాయణం మానసిక ప్రశాంతతో పాటు మనోధైర్యాన్ని ఇస్తుందన్నారు. భగవద్గీత ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బ్రహ్మశ్రీ గంగాధరశాస్త్రి మాట్లాడుతూ హనుమంతుడి జీవితగాథను ప్రతిఒక్కరూ తెలుసుకోవాలన్నారు. మనలో ధైర్యం, ఆత్మవిశ్వాసం నింపే ప్రతిఒక్కరూ హనుమంతులేనని ఉపదేశించారు. అనంతరం సామూహిక హనుమాన్ చాలీసా పారాయణంలో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, మెమెంటోలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ శ్యామ్‌కుమార్, ప్రమోద్‌కుమార్, సుంకు వేణుగోపాల్, ఆకుల రాఘవేంద్ర, ఎమరాల్డ్ రమణ, టీచర్ ప్రసాద్, సత్యనారాయణ, కామర్స్ రఘు, మురళి, రవి, హర్షద్ జైన్, న్యాయవాది గురుప్రసాద్, శ్రీపాద వేణు పాల్గొన్నారు.

## అంధులకు ఆదర్శం బ్రెయిలీ జీవితం



అంధులకు సెర్చ్ స్టిక్స్ అందజేస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): లూయీ బ్రెయిలీ జీవితం, లిపి అంధులకు ఆదర్శంగా, మార్గదర్శకంగా నిలిచాయని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. లూయిస్‌బ్రెయిలీ జయంతిని పురస్కరించుకుని జాతీయ అంధుల క్రీడా సమాఖ్య ఉమ్మడి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మూడు రోజులుగా స్థానిక కృష్ణకళామందిరంలో నిర్వహిస్తున్న అంధుల క్రీడా పోటీలు శనివారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ అంధులను ప్రోత్సహించి, అందరితో సమానంగా చూడాలని కోరారు. లూయిస్‌బ్రెయిలీ స్ఫూర్తితో అంధులు వివిధ రంగాల్లో రాణిస్తుండటం అభినందనీయమన్నారు. అంధుల ప్రతిభకు పదునుపెట్టే విధంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అనంతరం క్రీడలు, సాంస్కృతిక ప్రదర్శన పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమశాఖ డీడీ ఖుష్బూకొఠారి, అంధుల క్రీడాసమాఖ్య సభ్యులు విజయభాస్కర్, రవి, నాగశివారెడ్డి, నాగార్జున, ఎర్రిస్వామి, కుమార్ రాజా, అంధ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## అంధుల క్రికెట్ పోటీల విజేత తిరుపతి

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): అంధుల రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో తిరుపతి జట్టు విజేతగా నిలిచింది. లూయిస్ బ్రెయిలీ జయంతిని పురస్కరించుకుని అంధ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. స్థానిక ఆర్డీటీ స్టేడియంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న పోటీలు శనివారం ముగిశాయి. ఫైనల్ పోటీల్లో విశాఖపట్నంపై తిరుపతి జట్టు గెలిచి టోర్నీ విజేతగా నిలిచింది. స్థానిక రామ్‌నగర్‌లోని యాదవ కల్యాణమండపంలో శనివారం లూయీ బ్రెయిలీ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ లూయిస్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం క్రికెట్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో భారత అంధుల క్రికెట్ జట్టు కెప్టెన్ అజయ్‌రెడ్డి, మీనాక్షమ్మ ఫౌండేషన్ అధ్యక్షుడు వెంకటరమణ, లేడీస్‌క్లబ్ సభ్యురాలు శ్రీదేవి, వైద్యులు భవాని, పీఓసీ రమణ, అంధుల ఉద్యోగ సంఘం రాష్ట్ర కార్యదర్శి జలంధర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు వెంకటనారాయణ, కార్యదర్శి సాజియతీ తదితరులు పాల్గొన్నారు.

## ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం



ఏఎస్ఏ, నర్మదావ్యాలీ జట్ల మధ్య మ్యాచ్

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): అండర్-17 జాతీయస్థాయి బాలికల ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. దేశవ్యాప్తంగా 12 జట్లు, 216మంది క్రీడాకారిణులు భాగస్వాములైన 4వ ఇన్‌స్పైర్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను అనంత క్రీడా గ్రామంలో నిర్వహిస్తున్నారు. 8రోజుల పాటు సాగే టోర్నీని ఆర్డీటీ, లాలిగా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఇందులో కంపాసిజన్-గోవా, పెన్నా-ఏపీ, నర్మదావ్యాలీ-మధ్యప్రదేశ్, థామ్-తమిళనాడు, లైఫ్‌స్పోర్ట్స్-తమిళనాడు, నందిఫౌండేషన్-గుజరాత్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ గుజరాత్-గుజరాత్, అనంతపురం స్పోర్ట్స్ అకాడమీ (ఆంధ్రప్రదేశ్), స్పోర్ట్స్‌ప్లస్ ఫుట్‌బాల్ అకాడమీ-తమిళనాడు, ఫాల్కన్‌గర్ల్స్-ఒడిశా, లిబర్టీ లేడీస్-తమిళనాడు, బెంగళూరు జట్లు తలపడనున్నాయి. గ్రామీణ ప్రాంతాల క్రీడాకారిణులలో దాగి ఉన్న క్రీడానైపుణ్యతను వెలికితీసి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా అవకాశం కల్పించేందుకే ఈ పోటీలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. మొదటి రోజు అనంతస్పోర్ట్స్ అకాడమీ-ఆంధ్రా జట్టుపై నర్మదావ్యాలీ 3గోల్స్ తేడాతో, ఒడిశాపై గుజరాత్ 6 గోల్స్, గుజరాత్‌పై బెంగళూరు 17గోల్స్ తమిళనాడుపై పెన్నా-ఏపీ ఒక గోల్, తమిళనాడుపై కంపాసిజన్ 18గోల్స్, లైఫ్ స్పోర్ట్స్ అకాడమీపై స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ గుజరాత్ 10గోల్స్ తేడాతో విజయం సాధించాయి.

## జాబ్‌మేళా క్యాలెండర్ విడుదల



జాబ్‌మేళా క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్

అనంతపురం రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెలలో నిర్వహించనున్న జాబ్ మేళాలకు సంబంధించిన క్యాలెండర్‌ను కలెక్టర్ వినోద్‌కుమార్ శనివారం విడుదల చేశారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ప్రతినెలా నైపుణ్యాభివృద్ధి సంస్థ నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలను అందించేందుకు జాబ్‌మేళాలు నిర్వహిస్తుందన్నారు. ఈనెల 10న రాయదుర్గం నియోజకవర్గంలో కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీకళాశాల, శింగనమల నియోజకవర్గంలోని నార్పల పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తారన్నారు. 18న రాప్తాడు నియోజకవర్గం ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల, కళ్యాణదుర్గం నియోజకవర్గం ఆధ్వర్యంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ మేళా ఉంటాయన్నారు. వివరాలకు 8317520929, 8554281026 నెంబర్లను సంప్రదించాలన్నారు. ఈకార్యక్రమంలో అడిషనల్ జిల్లానైపుణ్యాభివృద్ధి అధికారి జగన్‌యాదవ్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ మహేష్ పాల్గొన్నారు.

## ఫ్రెండ్‌షిప్ క్రికెట్ సిరీస్ విజేత అనంత



విజేత అనంత, రన్నరప్ న్యూజిల్యాండ్ హాట్‌హాక్స్ జట్లు

అనంతపురం క్లాక్ టవర్, జనవరి 4 (ఆంధ్ర జ్యోతి): ఫ్రెండ్‌షిప్ క్రికెట్ సిరీస్ విజేతగా అనంత స్పోర్ట్స్ అకాడమీ జట్టు నిలిచింది. స్థానిక ఆర్డీటీ స్టేడియంలో శనివారం ఫ్రెండ్‌షిప్ క్రికెట్ సిరీస్ ఫైనల్ పోటీని హాట్‌హాక్స్ న్యూజిల్యాండ్, అనంత స్పోర్ట్స్ అకాడమీ జట్ల మధ్య నిర్వహించారు. మొదట బ్యాటింగ్ చేసిన అనంత స్పోర్ట్స్ అకాడమీ జట్టు నిర్ణీత 20ఓవర్లలో 5వికెట్లు కోల్పోయి 161పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన న్యూజిల్యాండ్ హాట్‌హాక్స్ జట్టు 20ఓవర్లలో 3వికెట్లు నష్టానికి 139 పరుగులు మాత్రమే చేసింది. అనంతరం ఫ్రెండ్‌షిప్ సిరీస్‌లో క్రీడాకారులకు ఫీల్డింగ్, బ్యాటింగ్, బౌలింగ్‌లో మెలకువలు నేర్పిన ఇంగ్లాండ్ క్రికెటర్ హసీబ్‌హమీద్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు పీఎల్ ప్రకాష్‌రెడ్డి, ఇన్‌చార్జి సెక్రెటరీ భీమలింగారెడ్డి, వెటరన్ క్రికెటర్ నాగప్పా, కిమ్స్ డైరెక్టర్ డాక్టర్ హబీబ్, న్యూజిల్యాండ్ మాజీ క్రికెటర్ బ్రూస్ ఎడ్గర్, న్యూజిల్యాండ్ హాట్‌హాక్స్ ఛైర్మన్ రవి కృష్ణమూర్తి, మాజీ రంజీ క్రీడాకారుడు షాబుద్దీన్, కోచ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

### గడువు పొడిగింపు

అనంతపురం టౌన్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల అక్రిడిటేషన్‌ల కాలపరిమితిని మరో రెండు నెలలు పొడిగించినట్లు జిల్లా సమాచారశాఖ డీఐపీఆర్వో గురుస్వామిశెట్టి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. గత డిసెంబరు 31నాటికి అక్రిడిటేషన్ కలిగి, ప్రస్తుతం పనిచేస్తున్న జర్నలిస్టులకు మాత్రమే ఈఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల వరకు పొడిగింపు సౌకర్యం ఉంటుందన్నారు. సంబంధిత మీడియా యాజమాన్యాలు ప్రస్తుతం పనిచేస్తున్న, తొలగించిన జర్నలిస్టుల వివరాలను తమకు పంపాలన్నారు.

### సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు: డీఎంఓ

అనంతపురం టౌన్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా తగిన చర్యలు తీసుకోవాలని సబ్ యూనిట్ ఆఫీసర్లకు జిల్లా మలేరియా నివారణాధికారి (డీఎంఓ) డాక్టరు ఓబులు ఆదేశించారు. జిల్లాకార్యాలయంలో శనివారం ఆయన సీజనల్ వ్యాధుల నియంత్రణపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా డీఎంఓ మాట్లాడుతూ సబ్‌యూనిట్ ఆఫీసర్లు నిత్యం గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలకు అవసరమైన వైద్యసేవలు అందేలా చూడాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది, ఆరోగ్యసిబ్బందితో కలిసి ఇంటింటికి తిరిగి ఫీవర్ సర్వే చేపట్టాలన్నారు. కొందరు సబ్‌యూనిట్ ఆఫీసర్లు సరిగా విధులకు వెళ్లడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయని, అలాంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

### ఫార్మసిస్టు పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం టౌన్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): కడపజోన్-4 పరిధిలో కాంట్రాక్ట్ పద్ధతిలో 15 ఫార్మసిస్టుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టరు ఈబీదేవి శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈనెల 17 వరకు దరఖాస్తు చేసుకోవడానికి గడువు ఉందన్నారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఈనెల 5 ఆదివారం, 12నుంచి 15వరకు సంక్రాంతి సెలవులు నేపథ్యంలో ఆరోజుల్లో దరఖాస్తులు స్వీకరించమన్నారు. పోస్టులకు సంబంధించిన దరఖాస్తు నమూనా, ఇతర వివరాలు http:-cfw. ap. gov. in వెబ్‌సైట్‌లో ఉంచినట్లు వెల్లడించారు. అర్హులైన అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తులను ప్రాంతీయ సంచాలకులు, వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం, కడపకు పంపాలన్నారు.

### చిట్టీల పేరుతో రూ. రెండు కోట్లకు టోకరా..?

గుత్తి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): చిట్టీల పేరుతో టోకరా వేసి ఉడాయించడంతో బాధితులు శనివారం రాత్రి స్థానిక పోలీసులను ఆశ్రయించారు. వివరాల మేరకు.. మున్సిపల్ పరిధిలోని సూరశింగనపల్లికి చెందిన అంజలీదేవి, పురుషోత్తం దంపతులు. అంజలీదేవి ఇంట్లో చీరల వ్యాపారం చేస్తూ, చిట్టీలు కూడా నిర్వహించేవారు. ఈమె గత పదేళ్లుగా చిట్టీలు నిర్వహిస్తున్నారన్నారు. అయితే దాదాపు రూ2కోట్ల మేరకు చిట్టీల డబ్బులు చెల్లించకుండా భర్తతో కలిసి నెలన్నర కిందట ఎక్కడికో వెళ్లిపోయారని బాధితులు స్థానిక ఎస్ఐ సురేష్‌కు తెలిపారు. కాగా శనివారం రాత్రి అంజలీదేవి తల్లిదండ్రులు ఇంటి తలుపులు తెరవడంతో సామగ్రిని తరలిస్తున్నారని సమాచారం తెలుసుకున్న బాధితులు అక్కడికి వచ్చి, వారితో గొడవకు దిగారు. అనంతరం బాధితులు పోలీసుస్టేషన్‌కు వెళ్లి, న్యాయం చేయాలని ఎస్ఐను కోరారు. బాధితులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే, విచారించి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వారికి తెలిపారు.

# కర్షకుల కష్టాలు..!

## పొలాల్లో వరుస చోరీలు

- ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం
- రాగివైరు ఎత్తుకెళ్తున్న దొంగలు
- ఇబ్బంది పడుతున్న రైతులు

కళ్యాణదుర్గం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): వరుస చోరీలతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు. ఇటీవల పొలాల్లో వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని రాగి వైరు చోరీ చేసే సంఘటనలు పెరిగిపోయాయి. దీంతో సాగునీరందక పంట పొలాలు ఎండిపోతున్నాయని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో పంటకు అడవి జంతువుల నుంచి కాపలా కాసే పరిస్థితుల నుంచి ట్రాన్స్‌ఫార్మర్లకు కూడా కాపలా ఉండాల్సి వస్తోందని వారు వాపోతున్నారు.



కళ్యాణదుర్గం మండలం భట్టువానిపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి రాగి వైరును ఎత్తుకెళ్లిన దృశ్యం (ఫైల్)



తన పొలంలో ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగివైరును ఎత్తుకెళ్లినట్లు చూపిస్తున్న రైతు పవన్ (ఫైల్)

**ఎడాపెడా చోరీలు..**

గత ఏడాది ఏప్రిల్ 30న కళ్యాణదుర్గం మండలంలోని కామక్కపల్లి ప్రాథమిక పాఠశాలలో సబ్ మెర్సిబుల్ మోటారును దుండగులు ఎత్తుకెళ్లారు. ఇదే నెలలో బోరంపల్లి సమీపంలోని ఓ వ్యవసాయ తోటలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులకొట్టి రాగి వైరును చోరీ చేశారు. యర్రంపల్లికి చెందిన ఓ రైతు పొలంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి, రాగి వైరును ఎత్తుకెళ్లారు. దురదకుంట, భట్టువానిపల్లి గ్రామాల్లో కూడా రెండు చోట్ల దుండగులు ట్రాన్స్‌ఫార్మర్లను పగులకొట్టి రాగి వైరు ఎత్తుకెళ్లారు. కంబదూరు మండలంలోని కుర్లపల్లిలో 24 గంటలు విద్యుత్ సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్‌ను దొంగలు పగుల కొట్టి, రాగి వైరును ఎత్తుకెళ్లారు. గ్రామ సమీపంలో ఉన్న ట్రాన్స్ ఫార్మర్‌ను ధ్వంసం చేసి రాగి వైరును ఎత్తుకెళ్లారు. ఓబయ్యతోట సమీపంలో కూడా ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి రాగి వైర్‌ను అపహరించారు. తాజాగా జనవరి 1న అర్ధ రాత్రి సమయంలో కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని గూబనపల్లి లే అవుట్‌లో రెండు ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేసి రాగి వైరును చోరీ చేశారు. అలాగే మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను కూడా ధ్వంసం చేసేందుకు ప్రయత్నించారు.

**రాగి వైరుకు డిమాండ్ ఉండటం వల్లే..**

గతంలో డ్రిప్పులు, స్ప్రింక్లర్లను మాత్రమే దొంగలు ఎత్తుకెళ్లేవారు. అయితే రాగికి మార్కెట్‌లో మంచి డిమాండ్, విలువ ఉండటంతో ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసంపై దృష్టి సారించారు. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో రాగి విలువ రూ. 900లు నుంచి రూ. 1000లు పలుకుతోంది. సాధారణంగా ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్‌లో 30 కిలోల నుంచి 40 కిలోల రాగి వైరు ఉంటుంది. ఒక కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను తయారు చేయడానికి దాని సామర్థ్యాన్ని బట్టి రూ. 30 వేలు నుంచి రూ. 45 వేల వరకు ఖర్చు అవుతుంది. కానీ దొంగలు మాత్రం ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులోని రాగి వైరును ఎత్తుకెళ్లి రూ. 12 వేలు నుంచి రూ. 15 వేలకే విక్రయిస్తున్నారు. తక్కువ ధరకు రాగి వైరు లభిస్తుండటంతో కొనేవారు కూడా ఆసక్తి చూపుతున్నారు.

**కాపలా వెళ్తున్నాం**



దొంగల తాకిడి ఎక్కువ కావడంతో రాత్రి పూట ట్రాన్స్‌ఫార్మర్లకు తోటల్లోకి కాపలాగా వెళ్తున్నాం. ట్రాన్స్‌ఫార్మర్ ఉంటేనే కదా, మోటార్లు పని చేసి, తోటకు నీరు సరఫరా అయ్యేది. అదే ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేస్తే, మరలా కొత్తది తెచ్చి పెట్టుకోవాలంటే చాలా కష్టం అవుతోంది. అందుకనే ముందుజాగ్రత్తగా కాపలా వెళ్తున్నాం. పోలీసులు చర్యలు తీసుకుని చోరీలను అరికట్టాలి.


-రామాంజి, రైతు, మేళ్లకుంట

**ప్రత్యేక నిఘా వేశాం**

ఈ ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం విషయం మా దృష్టికి వచ్చింది. ఈ చోరీలను అరికట్టడానికి ప్రత్యేక నిఘా వేశాం. దాంతోపాటు ప్రత్యేక పోలీస్ సిబ్బంది కూడా నియమించి వీటిని అరికట్టడానికి ప్రయత్నిస్తున్నాం.

- రవిబాబు, డీఎస్పీ, కళ్యాణదుర్గం

**ఆర్థికంగా నష్టపోతాం**



వేలాది రూపాయలు ఖర్చు చేసి, నానా అగచాట్లు పడి పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసుకుంటున్నాం. దొంగలు మాత్రం ఉద్దర సొమ్ముకు కక్కుర్తిపడి వాటిని ధ్వంసం చేస్తున్నారు. దీంతో ఆర్థికంగా బాగా నష్టపోతున్నాం. ఈ నష్టాన్ని భరించలేక ప్రతిరోజు రాత్రి పూట తోటల్లోకి కాపలాగా వెళ్తున్నాం. అరకొరగా పండుతున్న పంటలతో ఇబ్బందులు పడుతున్న మాలాంటి రైతులకు ఈ దొంగలు ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేస్తూ కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. -రవి, రైతు, ఒంటారెడ్డిపల్లి

## రేటెక్కువ.. వొద్దులేన్నా..!

### ప్రీమియం లిక్కర్ స్టోర్‌కు దరఖాస్తులు నిల్

**షరతులతో ముందుకురాని వ్యాపారులు**

అనంతపురం అర్బన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ప్రీమియం లిక్కర్ స్టోర్‌ను ఏర్పాటు చేసేందుకు ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. గత ఏడాది డిసెంబరు 17 నుంచే దరఖాస్తులను ఆ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు ఆహ్వానించారు. తొలుత డిసెంబరు నెలాఖరు దాకా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. దరఖాస్తు రుసుం రూ.15 లక్షలుగా నిర్ణయించడంతో వ్యాపారులు ఈ ప్రీమియం లిక్కర్ స్టోర్ ఏర్పాటు వైపు మొగ్గు చూపలేదు. ఒక్క దరఖాస్తు రాకపోవడంతో ఈనెల 7 వరకు గడువు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయినా దరఖాస్తులు వస్తాయో రావోనని సంబంధిత శాఖ అధికారులు సందేహం వ్యక్తం చేస్తున్నారు.

**దరఖాస్తు రుసుముతోనే వెనుకంజ**

జిల్లా కేంద్రానికి ఐదేళ్ల కాల వ్యవధితో ప్రీమియం లిక్కర్ స్టోర్‌ను మంజూరు చేశారు. తొలి ఏడాదిలో లైసెన్స్‌దారులు రూ.కోటి వార్షిక పన్ను చెల్లించాలని నిర్ణయించారు. రెండో సంవత్సరం 10 శాతం పెంచుతామన్నారు. ప్రీమియం లిక్కర్ స్టోర్ ఏర్పాటు కోసం కనీసం 4000 చదరపు అడుగుల వైశాల్యం ఉండాలని షరతు పెట్టారు. ఈ స్టోర్‌లో ఐఎంఎఫ్ఎల్ కనీస ధర రూ.1200, బీర్ ధర రూ.400పైన రేట్లు ఉండే స్టాక్ మాత్రమే విక్రయించాలనే నిబంధన విధించారు. ప్రీమియం స్టోర్ ఏర్పాటుకు దరఖాస్తు ను https//apsbcl.ap.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకునే వెసులు బాటు కల్పించారు. అయితే దరఖాస్తు ఫీజు రూ.15 లక్షలు నిర్ణయించడం, అది నాన్ రీఫండబుల్ కావడంతో వ్యాపారులు దరఖాస్తు చేయడానికి జంకుతున్నట్లు సమాచారం.

**ఏడో తేదీ వరకు గడువు: రామమోహన్‌రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్, అనంతపురం**

జిల్లాకేంద్రంలో ప్రీమియం లిక్కర్ స్టోర్ ఏర్పాటు కోసం తొలుత డిసెంబరు నెలాఖరు దాకా గడువు ఉండేది. దరఖాస్తులు రాకపోవడంతో ఈనెల ఏడో తేదీ సాయంత్రం 5 గంటల దాకా దరఖాస్తు గడువును రాష్ట్ర ఉన్నతాధికారులు పొడిగించారు. అనంతపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో దరఖాస్తులను ఆఫ్‌లైన్ పద్ధతిలో నేరుగా సమర్పించాలి. దాఖలైన దరఖాస్తులను రాష్ట్ర కమిషనర్‌కు పంపుతాం.

### నేడు ఎస్టీయూ జిల్లా కౌన్సిల్ సమావేశం

అనంతపురం విద్య, జనవరి 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) 78వ జిల్లా వార్షిక కౌన్సిల్ సమావేశం ఆదివారం సీపీఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, ప్రధానకార్యదర్శి రామాంజనేయులు, కోశాధికారి ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు సమావేశం ఉంటుందన్నారు. సమావేశానికి రాష్ట్ర ప్రధానకార్యదర్శి రఘునాథరెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, ఇతర నాయకులు హాజరవుతారన్నారు.

క్రైం కార్నర్

## నరసాపూర్-ధర్మవరం ఎక్స్‌ప్రెస్‌కు తప్పిన ప్రమాదం

- పాక్షికంగా విరిగిన రైలు పట్టా
- గమనించిన కీమన్
- ఎర్రజెండాతో రైలుకు ఎదురెళ్లిన వైనం
- నిదానంగా దాటిన ఎక్స్‌ప్రెస్

ధర్మవరం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): నరసాపూర్-ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలుకు శనివారం ప్రమాదం తప్పింది. దీంతో ప్రయాణీకులు, రైల్వే సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. మండలంలోని తిప్పేపల్లి సమీపాన ఎల్‌సీ నంబరు 8 వద్ద రైలు పట్టా పాక్షికంగా విరిగిపోయింది. చలికాలం దృష్ట్యా సంకోశం చెందిన రైలుపట్టా కొంత మేర విరిగిపోయింది. విధి నిర్వహణలో ఉన్న కీమన్ బండి ప్రసాద్ దానిని గమనించారు. అప్పటికే నర్సాపూర్-ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలు 120 కిలోమీటర్ల వేగంతో సమీపంలోకి వచ్చింది. ప్రమాదాన్ని తెలియజేస్తూ కీమన్ ఎర్రజెండాను ఊపుతూ రైలుకు ఎదురుగా వెళ్లారు. అతి వేగంతో వస్తున్న ఆ రైలు అప్పటికే పాక్షికంగా దెబ్బతిన్న ప్రాంతాన్ని దాటుకుని రెండు బోగీలు ముందుకెళ్లాయి. అదే రైలులో ప్రయాణిస్తున్న ఇంజనీరింగ్ అధికారుల సూచనతో నిదానంగా నడుపుకుంటూ ధర్మవరం స్టేషన్‌కు చేర్చారు. అదే వేగంతో మరిన్ని బోగీలు వెళ్లి ఉండుంటే ప్రమాదం సంభవించేదని రైల్వే వర్గాలు పేర్కొంటున్నాయి. శీతాకాలంలో రైలుపట్టాలు సంకోచించడం వల్ల పగుళ్లు వస్తాయని రైల్వే ఇంజనీర్లు పేర్కొన్నారు. రైలు వెళ్లిన అనంతరం అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని, మరమ్మతులు చేపట్టారు. కీమన్ బండి ప్రసాద్‌ను ప్రయాణీకులు, రైల్వే అధికారులు అభినందించారు.

### తల్లి, కుమార్తె అదృశ్యంపై కేసు నమోదు


కాయల రోజా


భవిష్య

గాండ్లపెంట, జనవరి 4(ఆంధ్రజ్యోతి): తల్లి, కుమార్తె అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ రామమోహన్ శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కదిరి మండలంలోని కుమ్మవాండ్లపల్లికి చెందిన కాయల రోజా గాండ్లపెంట మండలం కటారుపల్లి రైతు భరోసా కేంద్రంలో ఎంపీఈఓగా పనిచేస్తున్నారు. ఈనెల 3వ తేదీన కుమార్తె భవిష్యతోపాటు రోజాను ఆమె భర్త శ్రీనివాసులు రైతు భరోసా కేంద్రంలో విధులకు వదిలి పెట్టి వచ్చాడు. అప్పట్నుంచి ఇరువురు కనిపించట్లేదని బాధితులు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ రామమోహన్ తెలిపారు.

### ఆలయాల్లో చోరీ

శింగనమల, జనవరి 4(ఆంధ్రజ్యోతి): స్థానిక దుర్గాంజనేయ స్వామి కొండ మీద ఉన్న ఆలయాల్లో శుక్రవారం గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. ఐదు కిలోల వెండి, అమ్మవారి పంచలోహ విగ్రహం చోరీ అయ్యాయి. కొండమీద దుర్గాంజనేయస్వామి, సిరి దుర్గమ్మ దేవాలయాలు ఉన్నాయి. అర్ధరాత్రి సమయంలో ఆలయాలు తాళాలు ధ్వంసం చేశారు. అనంతరం ఆలయాల్లోకి చొరబడి దుర్గాంజనేయస్వామి విగ్రహం మీద ఉన్న వెండి కౌశం, కిరీటం, సిరి దుర్గమ్మ అమ్మవారి విగ్రహం మీద ఉన్న వెండి, బంగారం గిన్నె బొట్టుతోపాటు అమ్మవారి పంచలోహ విగ్రహాన్ని ఎత్తుకెళ్లారు. అర్చకులు ఫిర్యాదు మేరకు సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ విజయకుమార్ సిబ్బందితో సంఘటన్నా స్థలాన్ని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేయించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### విద్యార్థిని ఆత్మహత్య

రాయదుర్గం రూరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన గోవిందరెడ్డి సావిత్రమ్మల కుమార్తె భారతి(18) ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. భారతి బళ్లారిలోని ఎస్‌జీటీ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతోంది. ఈమెకు చదువు పట్ల ఆసక్తి లేకపోవడం, తల్లిదండ్రులు మాత్రం బాగా చదువుకోవాలని చెబుతుండటంతో మన స్తాపం చెందింది. ఈక్రమంలో శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. చుట్టు పక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ జయనాయక్ సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తల్లి సావిత్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## వదాన్య సొసైటీ సేవలు అమోఘం

- హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ
- సొసైటీకి రూ.లక్ష చెక్కు అందజేత


ఎమ్మెల్యే బాలకృష్ణ నుంచి చెక్కు అందుకుంటున్న వదాన్య సొసైటీ వ్యవస్థాపకుడు అశోక్ పడపాటి

కొత్తచెరువు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): కరువు ప్రాంతమైన ఉమ్మడి అనంతపురంజిల్లాలో విద్యాభివృద్ధికి వదాన్య సొసైటీ చేస్తున్న సేవలు అమోఘమని హిందూపురం ఎమ్మెల్యే, సినీ హీరో బాలకృష్ణ కొనియాడారని సొసైటీ వ్యవస్థాపకుడు అశోక్ పడపాటి తెలిపారు. నిస్వార్థంగా సమాజ సేవ చేస్తున్న వదాన్య సొసైటీని సినీ హీరో, ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రత్యేకంగా అభినందించారు. రూ. చెక్కును అందించినట్లు అశోక్ తెలిపారు. ఆ మొత్తాన్ని ఇటీవల నిర్వహించిన టాలెంట్, ఎస్టీటీ టెస్టుల విజేతలకు అందించనున్నట్టు అశోక్ పడపాటి వివరించారు.

# అద్దె భవనాల్లో.. అగచాట్లు..!

- శిథిలావస్థలో అంగన్‌వాడీ సెంటర్లు
- ఇబ్బందిపడుతున్న చిన్నారులు, గర్భిణులు
- అర్ధంతరంగా ఆగిన భవన నిర్మాణాలు
- పట్టించుకోని అధికారులు


రంగచేడులో అద్దె భవనంలో అంగన్‌వాడీ కేంద్రం

గుమ్మఘట్ట, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో అంగన్‌వాడీ సెంటర్లను అద్దె భవనాల్లో నడుపుతున్నారు. దీంతో సిబ్బందితో పాటు చిన్నారులు, గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు. అద్దె గదులు ఇరుగ్గా ఉండటం, గాలి, వెలుతురు సరిగా ఉండకపోవడంతో తమ పిల్లలను పంపడానికి తల్లిదండ్రులు ఇష్టపడటం లేదు. గదిలో స్థలం చాలక మధ్యాహ్న భోజనం తినడానికి వచ్చే గర్భిణులు సైతం ఇబ్బంది పడుతున్నారు. ఈ ఇబ్బందులను తొలగించడానికి, సొంత భవనాలు నిర్మించడానికి గత ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అయితే నిధులు సక్రమంగా విడుదల చేయకపోవడంతో ప్రారంభించిన పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి.

### సగం కేంద్రాలకే సొంత భవనాలు

మండలంలో 67 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో 31 కేంద్రాలకు సొంత భవనాలు ఉన్నాయి. 25 కేంద్రాలను అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. మిగతా 11 ప్రభుత్వ కార్యాలయ భవనాల్లో అద్దె లేకుండా నడుపుతున్నారు. మండల వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం పొందుతున్న చిన్నారులు 2401, బాలికలు 2374, గర్భవతులు 562, బాలింతలు 629 మంది ఉన్నారు. వీరందరికీ ఆయా గ్రామాల్లో సరైన కేంద్రం లేక నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వంలో నాడు- నేడు కింద అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి ఒక్కో కేంద్రానికి రూ. ఏడు లక్షల నిధులు మంజూరు చేశారు. ఆ పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. రంగచేడు, ఎస్ హొసళ్లి, అడిగుప్ప, ఫైడొడ్డి, ఆర్.కొత్తపల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు ఇలా అర్ధంతరంగా నిలిచిపోయిన వాటిలో ఉన్నాయి. గత టీడీపీ పాలనలో ఉపాధిహామీ పథకం నిధులతో ప్రారంభించిన జే వెంకటంపల్లి, నేత్రపల్లి గ్రామాలలో అంగన్‌వాడీ కేంద్రాలు మధ్యలోనే ఆగిపోయాయి. వీటిని సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు చొరవ చూపి అర్ధంతరంగా ఆగిన అంగన్‌వాడీ కేంద్రాలను పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


బీటీపీలో అర్ధంతరంగా ఆగిన అంగన్‌వాడీ కేంద్రం

### నాడు - నేడు నిధులు దుర్వినియోగం



గత వైసీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు నాడు - నేడు పథకం కింద నిధులు మంజూరు చేశారు. అయితే వాటిని సక్రమంగా వినియోగించుకోకుండా వైసీపీ నాయకులు దుర్వినియోగం చేశారు. దీంతో అన్నిచోట్లా అంగన్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణాలు ఆగిపోయాయి. బీటీపీలో ఆగిన అంగన్‌వాడీ భవనమే ఇందుకు నిదర్శనం. - బసవరాజు, బీటీ ప్రాజెక్టు

### నిధులు మంజూరు చేయాలి: రామప్ప, తాళ్లకెర



మండలంలో అంగన్‌వాడీకి భవనాలు లేక చిన్నారులకు అద్దెభవనాల్లో పౌష్టికాహారం అందిస్తున్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ భవనాలకు నిధులు మంజూరు చేసి పక్కాభవనాలు నిర్మించాలి.

### ప్రభుత్వం శ్రద్ధ పెట్టాలి - రామాంజనేయులు, గుమ్మఘట్ట



ప్రభుత్వం చిన్నారుల కోసం కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నప్పటికీ అవసరమైన భవనాలు నిర్మించుకోకపోవడం దారుణం. అద్దె భవనాల్లో చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం శ్రద్ధచూపి పక్కా భవనాలు వెంటనే నిర్మించాలి.

### ప్రతిపాదనలు పంపాం: పద్మావతి, సీడీపీఓ



మండలంలో పక్కాభవనాలు లేని అంగన్‌వాడీ కేంద్రాలను గుర్తించాం. అవసరమైన నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. అర్ధంతరంగా ఆగిన భవనాల న్నింటిని పూర్తి చేసేందుకు అవసరమైన నిధుల కోసం అధికారులకు నివేదికలు పంపాం. చిన్నారులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా మెరుగైన సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

## లింగ నిర్ధారణ చేస్తే జైలుకే

- స్కానింగ్ సెంటర్లపై నిఘా పెట్టండి
- కలెక్టరు వినోద్‌కుమార్


సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టరు వినోద్‌కుమార్

అనంతపురం టౌన్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): చట్ట విరుద్ధంగా గర్భస్థ లింగ నిర్ధారణ చేసేవారిని జైలుకు పంపాలని కలెక్టర్ వినోద్‌కుమార్ వైద్యాధికారులను ఆదేశించారు. లింగనిర్ధారణ నిషేధిత చట్టం అమలుపై కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి కమిటీతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టరు మాట్లాడుతూ గర్భస్థ లింగ నిర్ధారణ నివారణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. తొలుత ఈచట్టంపై అవగాహన పెంచడానికి విస్తృతంగా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. జిల్లాలో స్కానింగ్ సెంటర్లపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు. స్కానింగ్‌చేసి, ఆడపిల్ల ఉంటే అబార్షన్ చేస్తున్నారనే ఆరోపణలున్న వారిని ఆధారాలతో పట్టుకుని, చట్టప్రకారం శిక్ష పడేలా చూడాలన్నారు. వైద్యాధికారులు, జిల్లాకమిటీతోను, ఇతరశాఖల అధికారులతో సమన్వ యం చేసుకుని చట్టాన్ని అమలు చేయాలన్నారు. ఆడపిల్ల ప్రాముఖ్యత గురించి ప్రజలు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా అదనపు కోర్టు న్యాయాధికారి శోభారాణి మాట్లాడుతూ లింగ నిర్ధారణ నివారణ చట్టం అమలుకు లీగల్ సర్వీసెస్ అథారిటీ అవసరమైన సహకారం అందిస్తుందన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టరు ఈబీదేవి, గైనకాలజీ విభాగాధికారి డాక్టరు షంషాద్‌బేగం, పోలీస్‌శాఖ సీఐ వెంకటేశ్వర్లు, ఆర్డీటీ హెల్త్ డైరెక్టరు డాక్టరు దుర్గేష్, రెడ్స్ భానుజా, డెమో త్యాగరాజు, గంగాధర్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

**స్వయం ఉపాధికి రుణాలు ఇవ్వండి**

స్వయం ఉపాధికి సంబంధించిన పథకాలకు లక్ష్యం మేరకు రుణాలు ఇవ్వాలని బ్యాంకర్లను కలెక్టరు ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం ఆయన బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. కలెక్టరు మాట్లాడుతూ బీసీయాక్షన్ ప్లాన్ కింద స్వయం ఉపాధి పథకం ద్వారా జిల్లాకు 1728యూనిట్లు మంజూరయ్యాయన్నారు. జిల్లాలో 13 బ్యాంకుల పరిధిలో యూనిట్‌ల కింద అర్హులైన లబ్ధిదారులకు రుణాలు ఇవ్వాలని సూచించారు. రూ.రెండు లక్షలు విలువ కలిగిన యూనిట్‌లు 1228ఉండగా, రూ. రెండు లక్షల నుంచి రూ. మూడు లక్షలు విలువ ఉన్న యూనిట్లు 368 ఉన్నాయ న్నారు. రూ. మూడు లక్షల నుంచి రూ.ఐదు లక్షలు విలువ చేసే యూనిట్‌లు 132 జిల్లాకు మంజూరయ్యాయన్నారు. ఆయా బ్యాంకులకు కేటాయించిన లక్ష్యాలను చిత్తశుద్ధితో పూర్తి చేయాలని సూచించారు. ఈనెల 8నుంచి 16వరకు ఆన్‌లైన్‌లో సైట్ ఓపెన్ అవుతుందని మీసేవ, సచివాలయాలలో అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టరు తెలిపారు.

**జిల్లాకు 72 జనరిక్ మందుల షాపులు**

జిల్లాకు కొత్తగా 72 జనరిక్ మందుల షాపులు మంజూరైనట్లు కలెక్టరు వినోద్‌కుమార్ తెలిపారు. ఈబీసీ నిరుద్యోగ యువతకు ఈషాపులు కేటాయిస్తామన్నారు. ఈషాపు విలువ రూ.8లక్షలు ఉండగా అందులో రూ.4లక్షలు సబ్సిడీ పోగా బ్యాంకు రూ.4లక్షలు రుణం ఇస్తుందన్నారు. అర్హత కలిగిన బీసీ, ఈబీసీ యువత ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టరు కోరారు. సమావేశంలో బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం, ఎల్‌డీఎం నర్సింగరావు, జిల్లా వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ, ఫిషరీష్ డీడీ శ్రీనివాసనాయక్, డీసీసీబీ సీఈఓ సురేఖారాణి పలు బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజాతీర్పుతో జగన్‌కు మైండ్ బ్లాంక్: మంత్రి సవిత



పెనుకొండ టౌన్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రజలిచ్చిన 2024 ఎన్నికల తీర్పుతో జగన్మోహన్‌రెడ్డికి మైండ్‌బ్లాక్ అయి, చిన్నమెదడు పనిచేయలేదని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. లక్షల మంది తల్లులు, పిల్లలు, రైతులకు అన్యాయం తలపెడుతున్నారని జగన్మోహన్‌రెడ్డి సోషల్ మీడియా వేదికగా మాట్లాడటం సిగ్గుచేటని ఖండించారు. టీడీపీ స్థానిక కార్యాలయంలో శనివారం మంత్రి మట్లాడుతూ.. జగన్ సక్రమంగా సంక్షేమ పథకాలు అందించకపోవడంతోనే 11 ఎమ్మెల్యే సీట్లకు పడిపోయారన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలుసనీ, జగన్ పదేపదే గుర్తుచేయాల్సిన అవసరం లేదన్నారు. సమస్య ఉంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలన్నారు. 'అప్పుడే రాష్ట్ర ప్రజలకు నీ అవినీతి తెలుస్తుంద'ని జగన్‌పై మండిపడ్డారు. జగన్ గాలోడు కాబట్టే హామీలిచ్చి, అమలు చేయలేక హెలీకాప్టర్‌లో తప్పించుకుని తిరిగాడన్నారు. సీపీఎస్ రద్దు చేస్తానని చెప్పి, మొఖం చాటేశాడన్నారు. సంపూర్ణ మద్య నిషేధమని చెప్పి జనం చెవిలో పూలు పెట్టాడన్నారు. ఇచ్చిన వాటితోపాటు ఇవ్వని హామీలు కూడా నెరవేరుస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఇప్పటికే సూపర్ సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. గాడితప్పిన వ్యవస్థలను లైన్‌లో పెట్టడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, రేయింబవళ్లు పనిచేస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఇలాంటి గాలిమాటలు మాట్లాడవద్దని జగన్‌కు హితవు పలికారు.

## ప్రధాని రాష్ట్ర పర్యటనను నిరసిద్దాం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్


మాట్లాడుతున్న రాంభూపాల్

అనంతపురం కల్చరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ రాష్ట్ర పర్యటనకు వ్యతిరేకంగా ఈనెల 7న నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా కార్యాలయంలో శనివారం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విభజన చట్టంలో భాగంగా కడపలో ఉక్కు పరిశ్రమ ను స్థాపించాల్సి ఉండగా, ఇపుడు కడప ఉక్కు మా పరిశీలనలో లేదని చేతులెత్తే యడం దారుణమన్నారు. రాష్ట్ర విభజన హామీలు అమలు చేయకుండా, వెనుకబడిన ప్రాంతాలకు నిధులివ్వకుండా మోసం చేసిన బీజేపీ ప్రస్తుతం తాను ప్రభుత్వం ఏర్పాటు చేసింది ఆంధ్రా ఎంపీల మద్దతుతోనే అన్న విషయం మరువరాదన్నారు. తెలుగుదేశం, జనసేన మద్దతుతో మూడోసారి కేంద్రంలో అధికారంలో ఉండికూడా రాష్ట్రానికి బీజేపీ అన్యాయం చేయగలుగుతోందంటే అందుకు అధికార, ప్రతిపక్ష పార్టీలే కారణమన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప మాట్లాడుతూ ఆంధ్రుల హక్కుగా సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకునేందుకు సుమారు రెండేళ్లుగా ప్రజలు పోరాడుతున్న విశాఖపట్నానికి ప్రధాని రావడం ఆంధ్రులను అగౌరపరచడమే నన్నారు. రాష్ట్రంలోని ఓడరేవులు, రోడ్లు, రైల్వేలైన్లను ప్రభుత్వం అదానీ కంపెనీకి అప్పగిస్తోందని ఆరోపించారు. అందుకే ప్రధాని మోదీ ఆంధ్రప్రదేశ్ పర్యటనను నిరసిస్తూ జిల్లాకేంద్రంలో ఈనెల 7న నిరసనలు చేపడతామన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బాలరంగయ్య అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నాగేంద్రకుమార్, సావిత్రి, శ్రీనివాసులు, రామిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణమూర్తిరాజు, జిల్లా కమిటీ సభ్యులు నాగమణి, రామాంజినేయులు, తరిమెల రాజు, వెంకటనారాయణ, నిర్మల, అచ్యుతప్రసాద్, మల్లికార్జున, మారుతీప్రసాద్, ముత్తుజా, ఓతూరు పరమేష్, కసాపురం రమేష్ పాల్గొన్నారు.

## పసి చేతులతో పాడు పనులు

- కళేకుర్తి పాఠశాల విద్యార్థులతో మరుగుదొడ్ల క్లీనింగ్


పాఠశాలలో మరుగుదొడ్లు కడుగుతున్న విద్యార్థులు

కణేకల్లు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కళేకుర్తి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో మరుగుదొడ్లు శుభ్రం చేయిస్తున్న ఫొటోలు శనివారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పసి పిల్లలలో గలీజు పనులు చేయించడం ఏంటని మండపడ్డారు. ఈ విషయంపై ఇన్‌చార్జ్ హెచ్ఎం పుష్పావతిను వివరణ కోరగా పాఠశాలలో మరుగుదొడ్లు కడుగుతున్న ఆయాకు నీళ్ల ఇచ్చేందుకు మాత్రమే విద్యార్థులు వెళ్లారన్నారు. పిల్లలతో మరుగుదొడ్లు క్లీన్ చేయించలేదని తెలిపారు.

## అణగదొక్కాలని చూస్తే సహించం

- చేనేతల సత్తా చూపుతాం: ఎమ్మెల్యే కందికుంట
- ఘనంగా చేనేత కులాల ఐక్యవేదిక సదస్సు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

ధర్మవరం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): అణగదొక్కాలని చూస్తే సహించబోమనీ, చేనేత కులాల సత్తా ఏంటో చూపుతామని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఉద్ఘాటించారు. స్థానిక శివానగర్‌లోని శివాలయం వద్ద పట్టణ చేనేత కులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన సదస్సుకు ఎమ్మెల్యే కందికుంట ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమానికి చేనేత ప్రముఖురాలు జయశ్రీ అధ్యక్షత వహించారు. అంతకుముందు కదిరిగేటు వద్ద ఉన్న చేనేత విగ్రహానికి పూల మాల వేసి, అక్కడి నుంచి వెండిరథంపై శివాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అక్కడ శివాలయంలో పూజలు నిర్వహించారు. సమావేశానికి రాయలసీమ జిల్లాలతోపాటు కర్ణాటక, తెలంగాణ నుంచి కూడా భారీగా చేనేత నాయకులు హాజరయ్యారు. కందికుంట మాట్లాడుతూ.. 80వ దశకం నుంచి ముందు వరుసలో ఉన్న చేనేతలు నిస్వార్థంగా అందరినీ అందలమెక్కిస్తున్నారన్నారు. అలా అందలం ఎక్కిన వారే చేనేతలను పాతాళానికి తొక్కేస్తుండటం సహించరానిదన్నారు. చేనేతలను చైతన్యవంతులను చేసి, రాజకీయ సుస్థిరత స్థాపించాలన్నదే తమ అభిమతమన్నారు. ధర్మవరం నియోజకవర్గం టీడీపీకి కంచుకోటగా మారిందంటే అందులో చేనేతలదే కీలకపాత్ర అన్నారు. నిస్వార్థంగా పేదలకు సేవ చేస్తూ నాయకత్వ లక్షణాలు పెంచుకుంటే పదవులు వెన్నంటే వస్తాయన్నారు. ధర్మవరంలో కౌన్సిలర్, చైర్మన్ పదవులతో మురిసిపోతుంటారన్నారు. ఉన్నత పదవులే లక్ష్యంగా పనిచేయాలని హితవు పలికారు. తనకు కదిరి నియోజకవర్గమే సర్వస్వమన్నారు. ధర్మవరం చేనేతల అభివృద్ధికి సహకారం అందిస్తానని ఆయన అన్నారు. అనంతరం కందికుంటను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చేనేత ప్రముఖులు బండారు ఆనందప్రసాద్, గిర్రాజు రవి, ప్రకాశ్, పోలా ప్రభాకర్, గుద్దిటి రాము, గడ్డం శ్రీనివాసులు, గడ్డం పార్థసారధి, పరిశే సుధాకర్, బీరే గోపాలకృష్ణ పాల్గొన్నారు.

## అట్టహాసంగా బాలవికాస్ సదస్సు


నృత్యం చేస్తున్న చిన్నారులు

పుట్టపర్తి, జనవరి4(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో బాలవికాస్ సదస్సును శనివారం అట్టహాసంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థులు, గురువులు పాల్గొన్నారు. సదస్సును సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ ప్రారంభించారు. విద్యార్థుల వేదపఠనంతో వేడుకలు మొదలయ్యాయి. పలువురు వక్తలు.. బాలవికాస్ విద్య ప్రాధాన్యతను వివరించారు. ఉత్తమ బాలవికాస్ గురువులను ఆర్‌జే రత్నాకర్‌తోపాటు ట్రస్టు సభ్యులు చక్రవర్తి, మినీష్‌పాండే మొమెంటోలతో సత్కరించారు. బాలవికాస్ వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. బాలవికాస్ చిన్నారులు నృత్యంతో భక్తులను అలరింపజేశారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. సదస్సులో 2,500 మంది బాలవికాస్ ప్రస్తుత, పూర్వ విద్యార్థులు, గురువులు పాల్గొన్నారు.


బాలవికాస్ గురువును సత్కరిస్తున్న ఆర్‌జే రత్నాకర్, చక్రవర్తి

# పనిచేయని నిఘానేత్రాలు

- రెండేళ్లుగా నిద్రలో..
- మితిమీరిన దొంగతనాలు
- కార్లు, బైక్‌ల అపహరణ
- బెంబేలెత్తుతున్న స్థానికులు
- పట్టించుకోని పోలీసు అధికారులు


అంబేడ్కర్ కూడలిలో పని చేయని సీసీ కెమెరాలు


బస్టాండ్ కూడలిలో నిరుపయోగంగా ఉన్న సీసీ కెమెరాలు

ముదిగుబ్బ, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు దాదాపు రెండేళ్ల నుంచి పని చేయడం లేదు. గతంలో టీడీపీ టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన ఆ సీసీ కెమెరాలు చెడిపోయాయి. రెండెళ్ల నుంచి అవి పని చేయకున్నా... వైసీపీ పాలకులు వాటి మరమ్మతుల గురించి ఏ మాత్రం పట్టించుకోలేదు. మరమ్మతులు చేయించి అందుబాటులోకి తీసుకురావాలన్న ఆలోచన కనీసం అధికారుల్లో కూడా లేకుండాపోయిందని స్థానికులు వాపోయారు. సర్కిల్‌ల్లో రాత్రి సమయాల్లో దుకాణాలు, ఇళ్ల ముందు ఉంచిన కార్లు, ద్విచక్ర వాహనాలు చోరీలకు గురయ్యాయి. ప్రధానంగా బస్టాండ్ కూడలిలో ప్రయాణికులు బస్సులు ఎక్కే సమయంలో సెల్‌ఫోన్లు అధికంగా చోరీకి గురవుతున్నాయి. గతంలో సీసీకెమెరాలు ఉండటంతో వాటి భయంలో చోరులు భయపడేవారు. అయితే ఇప్పుడు అవి పనిచేయకోవడంతో చోరులు తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. స్థానిక అంబేడ్కర్ కూడలిలో వార పు సంత జరుగుతుండటంతో తరచూ ప్రమాదా లు జరుగుతున్నాయి. గతంలో ఆ ప్రమాదాలకు కారకులను గుర్తించేందుకు సీసీకెమెరాలు ఎంతో దోహదపడేవి. సాయినగర్‌లో మూడు నెలల క్రితం ఇంటి ముందు పార్కింగ్ చేసిన కారు అపహరణకు గురైంది. అదేవిధంగా పట్ట పగలే దుకాణం ముందు పార్కింగ్ చేసిన పలు ద్విచక్రవాహనాలూ చోరీకి గురయ్యాయి. అప్పట్లో సీసీ ఫుటేజీల ద్వారా బైక్‌లు, సెల్‌ఫోన్లను పోలీసులు రికవరీ చేసి.. బాధితులకు అందజేసేవారు. కాని ప్రస్తుతం సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో దొంగలను గుర్తించడానికి వీలు లేకుండా పోయింది. గతంలో ట్రాఫిక్ సమస్య ఏర్పడినా.. ఘర్షణలు జరుగుతున్నా.. స్టేషన్‌లోని సీసీ కెమెరాల ద్వారా ఎస్‌ఐ విషయాన్ని తెలుసుకొని.. వెంటనే రంగంలోకి దిగి సమస్యను పరిష్కరించేవారు.

ప్రస్తుతం సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో ఎవరైనా పోలీసులకు సమచారం ఇస్తేనే వారు వస్తున్నారు. గత రెండేళ్లుగా సీసీ కెమెరాలు పనిచేయ కపోవడంతో శాంతిభద్రతలు, చోరీలు, ట్రాఫిక్ సమస్యలు అధికమయ్యా యని, ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి వాటికి మరమమ్మతులు చేయించి వినియోగంలోకి తెచ్చేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

### కొత్తవి ఏర్పాటు చేస్తాం



ముదిగుబ్బలో సీసీ కెమెరాలు పనిచేయలేదు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో కొత్త వాటిని ఏర్పాటు చేయించి చోరీలను అరికడతాం.

- శ్రీనివాసులు, డీఎస్పీ, ధర్మవరం

### సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి



మండల కేంద్రంలో గతంలో సీసీ కెమెరాల సహాయంతో చోరీలను అరికట్టేవారు. ప్రస్తుతం సీసీ కెమెరాలు పనిచేయక పోవడంతో చోరీలు ఇటీవల అధికమయ్యాయి. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు సీసీకెమెరాలకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది.

- చల్లాశ్రీనివాసులు, ముదిగుబ్బ

# కళాశాలల్లో మధ్యాహ్న భోజనానికి శ్రీకారం


కొత్తచెరువు: మధ్యాహ్న భోజనం తింటున్నఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

కొత్తచెరువు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఇంటర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకాన్ని కూటమి ప్రభుత్వం శనివారం ప్రారంభించింది. స్థానిక కళాశాలలో ఈ పథకాన్ని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ప్రారంభించారు. కలెక్టర్ టీఎస్ చేతన్ మాట్లాడు తూ.. జిల్లాలోని 21 కళాశాలల్లో 6,220 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. అన్నం పర బ్రహ్మ స్వరూపమని, దానిని వృథా చేయకుండా జాగ్రత్తగా విద్యార్థులు స్వీకరించాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాజీ మంత్రి, కలెక్టర్ మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్ర మంలో డీఈఓ కిష్టప్ప, డీఐఈఓ రఘునాథరెడ్డి, ఎంఈఓ జయచంద్ర, తహసీల్దార్ నీలకంఠారెడ్డి, ఎంపీడీఓ నటరాజ్, కళాశాల ప్రిన్సిపల్ జ్యోతిర్లత, కళాశాల స్థల దాత పీవీ పార్వతమ్మ, విశ్రాంత ఉపాధ్యాయుడు వెంగన్న, విద్యార్థులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

● ముదిగుబ్బ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని సీఐ శివరాముడు, టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ తుమ్మల మనోహర్ ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రామరాజు, ఎంఈఓ రమణప్ప, జనసేన మండల కన్వీనర్ గుర్రం జయచంద్ర బాలికల, బాలుర పాఠశాలల హెచ్‌ఎంలు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

● తాడిమర్రి : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని టీడీపీ నాయకులు, అధికారులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రంగారావు, తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి, ఎంఈఓ కృష్ణమోహన్, టీడీపీ నాయకులు ఆది నారాయణ, హర్ష, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గోనుగుంట్ల భూషణ్, స్థానిక సర్పంచ్ బాలమ్మ, పక్కీర్‌రెడ్డి, పాల్గొన్నారు.

● కదిరి : స్థానిక బాలికల జూనియర్ కళాశాలలో ఆర్డీఓ వీవీఎస్ శర్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎం వెంకటేశ్వరప్రసాద్, ఎంఈఓ ఓబుళరెడ్డి, అధ్యాపకులు ఎంఎస్ ప్రశాంత్, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే అమడగూరు ఈ పథకాన్ని ఎంఈఓ సంపూర్ణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్, టీడీపీ నాయకులు శ్రీనివాసరెడ్డి, రామాంజులనాయుడు, రాజారెడ్డి, నాగరాజు, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

# లూయి బ్రెయిలీకి ఘన నివాళి


నల్లచెరువు : కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

నల్లచెరువు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): అంధుల లిపి సృష్టికర్త లూయి బ్రెయిలీ జయంతి సందర్భంగా స్థానిక భవితకేంద్రంలో ఆయన చిత్ర పటానికి శనివారం పలువురు పూల మాలలు వేసి.. నివాళులర్పించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ... లూయి బ్రెయిలీ జీవిత చరిత్ర.. అంధుల లిపిని ఎలా కొనుగొన్నారు.. ఆ లిపి అంధుల జీవితాల్లో ఎలా వెలుగులు నింపుతోంది.. అన్న విషయాలను వివరించారు. మార్టిన్ అనే ఉపాధ్యాయుడు భవిత కేంద్రానికి క్యారంబోర్డు, మూడు మ్యాట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ తిరుపాల్‌నాయక్, ప్రత్యేక ఉపాధ్యాయులు నరసింహులు, గౌస్‌ఖాన్, హెచ్‌ఎం విజయలక్ష్మి, పి.వినయ్, శ్రీనివాసులరెడ్డి, శివశంకర్, సంధ్య, రూపవతి, విద్యార్థులు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

● ఓబుళదేవరచెరువు : స్థానిక భవిత కేంద్రంలో బ్రెయిలి చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి, నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పుష్పలత, నిర్మల, అతావుల్లా, ఐఆర్పీలు నరసింహబాబు, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

● కదిరి అర్బన్ : స్థానిక భవిత కేంద్రంలో ప్రపంచ బ్రెయిలి దినోత్సవాన్ని నిర్వహించారు. బ్రెయిలి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 ఓబుళరెడ్డి, ఉపాధ్యాయులు రామానాయక్, షక్కీలా, ఐఈఆర్పీ సౌజన్య, ఎమ్మార్సీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

● ధర్మవరంరూరల్ : స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని బీజేపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి హరీష్‌బాబు ప్రారంభించారు. ఇందులో ఎంఈఓ గోపాల్‌నాయక్, పాఠశాల హెచ్‌ఎం శైలజ, మంత్రి కార్యాలయ పీఏ మల్లికార్జున, బీజేపీ నాయకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## సౌత్‌జోన్ వాలీబాల్ పోటీలకు ఎంపిక


దివ్యశ్రీ

పుట్టపర్తిరూరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): చెన్నై జేపీయార్ యూనివర్శిటీలో ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్శిటీ వాలీబాల్ పోటీలకు మంగళకర విద్యార్థిని దివ్యశ్రీ ఎంపికైంది. దివ్యశ్రీ మండలంలోని జగరాజుపల్లి మంగళకర డిగ్రీకళాశాలలో బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈమె శ్రీకృష్ణదేవరాయ యూనివర్శిటీ వాలీబాల్ జట్టు తరఫున ఈ పోటీల్లో పాల్గొంటుందని మంగళకర ఎడ్యుకేషన్ ట్రస్టీ సురేష్‌కుమార్ శనివారం పేర్కొన్నారు.

## ఖాళీ స్థలాలకు రూ.200లే పన్ను

కదిరి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో ఖాళీ స్థలం విలువ రూ.లక్ష ఉంటే, కేవలం రూ.రెండు వందలు మాత్రమే పన్ను విధించామని, ఆరు నెలలకు ఒకసారి ఆ పన్ను చెల్లించాలని కమిషనర్ కిరణ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో సబ్‌రిజిస్ట్రార్ శ్రీనివాసులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఖాళీ జాగాలున్న ప్రతి ఒకరూ పన్ను కట్టాలని, ఆ పన్ను కట్టిన తరువాతే స్థలాల రిజిస్ట్రేషన్లు అవుతాయని అన్నారు. ఏళ్ల తరబడి కొంతమంది పన్నులు కట్టడంలేదని, అధికంగా బకాయి ఉన్న వంద మంది పేర్లను వివిధ కూడలిల్లో ఫ్లెక్సీలు వేసి ప్రదర్శిస్తామన్నారు. అందుకుకూడా స్పందించకపోతే నీరు, కరెంటు కట్ చేయడంతో పాటు చెత్త సేకరించడం నిలిపివేస్తామన్నారు. ప్లాస్టిక్ కవర్లు వేసి ఇడ్లీలు తయారు చేస్తున్నారని, అటువంటి హోటళ్ల నుంచి ఆ ఇడ్లీలు కొనుగోలు చేయకూడదని అన్నారు. అలాంటి హోటల్ యజమానులపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## మఠం భూమిలో పట్టాలు ఇవ్వాలి

బత్తలపల్లి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): కూటమి నాయకులు ఎన్నికల ముందు అర్హులైన పేదలకు మఠం భూమిలో పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీని నెరవేర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బత్తలపల్లిలో శనివారం ఆ పార్టీ నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసనలో వేమయ్య మాట్లాడారు. బత్తలపల్లిలో మఠం భూమిని గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వైసీపీ నాయకులు కబ్జాకు యత్నించారని, ఆ భూమిని అక్రమార్కుల పరం కాకుండా పేదలకు పట్టాలు ఇవ్వాలని కోరారు. అనంతరం డీటీ రామకృష్ణకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో మధు, కాటమయ్య, ఆంజినేయులు పాల్గొన్నారు.

● కరువు మండలంగా ప్రకటించాలి : బత్తలపల్లిను కరువు మండలంగా ప్రకటించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ధర్నా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ... మండలంలో రైతులు పంటలు సాగు చేసి సకాలంలో వర్షాలు రాక... పంటలను నష్టపోయారన్నారు. కనీసం పెట్టిన పెట్టుబడి కూడా చేతికి అందక అప్పుల పాలయ్యారన్నారు. రైతులు ఇంత నష్టపోయిన దిక్కుతోచని స్థితిలో ఉంటే బత్తలపల్లి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించకపోవడం దారుణమని, బత్తలపల్లి మండలానికి అన్యాయం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.


డీటీకి వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

## న్యూస్ బాక్స్ ...

### రైతులు పేర్లు నమోదు చేసుకోండి

ధర్మవరం రూరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మద్దతు ధరతో కందులు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, విక్రయించదలచిన రైతులు పేర్ల నమోదు చేసుకోవాలని ఏఓ ముస్తాఫా సూచించారు. శనివారం మండలంలోని పోతు కుంట, కుణుతూరు గ్రామ రైతుసేవా కేంద్రాల్లో జరుగుతున్న పేర్ల నమోదు కార్యక్రమాన్ని పరిశీలించిన ఆయన మా ట్లాడారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.7550 లేదా మార్కెట్ ధర ఎంత ఉంటే ఆ ధరతో ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా కందులు కొనుగోలు చేస్తుందన్నారు. సాగుచేసిన రైతులం దరూ తొందరపడి తక్కువ ధరకు అమ్ముకోవద్దని సూచించారు.

### 8, 9న న్యాక్ బృందం పర్యటన

ధర్మవరం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): స్థానిక కెహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధ, గురువారాల్లో నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ బృందం పర్యటిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యాక్ ప్రమాణాలతో కళాశాల అభివృద్ధిని, సంస్థాగత విలువలను పర్యవేక్షించి.. అవసరమైన పురోగతిని ఆ బృంద సభ్యులు సూచిస్తారన్నారు. కళాశాలలో ఉన్నమౌలిక వసతులు, బోధన, పరిశోధన తదితర అంశాలతో పాటు ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పూర్వవిద్యార్థులతో మాట్లాడతారన్నారు. కళాశాలలో విద్య పూర్తి చేసుకుని వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు, ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కళాశాలకు బుధవారం మధ్యాహ్నం రావాలని కోరారు.

### చేనేత పరిరక్షణకు సహకరించండి

ధర్మవరం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): చేనేత సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లి... చేనేత పరిశ్రమ పరిరక్షించాలని ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకులు కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌ను కోరారు. శనివారం ధర్మవరానికి వచ్చిన ఎమ్మెల్యేకు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పోలాలక్ష్మీనారాయణ, జిల్లా కార్యదర్శి వెంకటనారాయణ వినతి పత్రం అందజేశారు. నేతన్న నేస్తం అమలు, 200 యూనిట్లు ఉచిత విద్యుత్‌ను వెంటనే అమలు చేయాలని, దరఖాస్తు చేసుకున్న చేనేతలకు పింఛన్లను మంజూరు చేయాలని, చేనేతలకు ప్రత్యేకంగా హౌసింగ్ స్కీం ద్వారా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, మరమగ్గాలలో చేనేత రకాలు తయారు చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. వారి వెంట చేనేత నాయకులు గుర్రం వెంకటస్వామి, చెన్నంపల్లి శ్రీనివాసులు, విజయభాస్కర్, పాలగిరి శ్రీధర్ ఉన్నారు.

### హైందవ శంఖారావానికి తరలిన ప్రజలు

నంబులపూలకుంట, జనవరి 4(ఆంధ్రజ్యోతి): విజయవాడలోని కేసరపల్లిలో ఆదివారం నిర్వహిస్తున్న హైదవ శంఖారావానికి మండల ప్రజలు శనివారం దాదాపు 50 మంది బస్సులో బయలు దేరారు. మొదటగా మండలంలోని తిమ్మమ్మ మర్రిమాను వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశ్వహిందూపరిషత్ మండల కన్వీనర్ జయరాం, గోపాలక్రిష్ణ మాట్లాడుతూ.. హిందూ దేవాలయాలను మనమే సంరక్షించుకోవాలన్నారు. ఆలయాలపై ఇతరుల పెత్తనం వద్దని, హిందువులే ఆలయాల అభివృద్ధికి పాటుపడాలని అన్నారు. కార్యక్రమంలో గురివిరెడ్డి, రామానంద, మనోహర్, చంద్రస్వామి, వెంకట్ పాల్గొన్నారు.

### రెవెన్యూ సమస్యలపై విచారణ

బుక్కపట్నం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఆయా గ్రామాల్లో నెలకున్న రెవెన్యూ సమస్యలపై పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ శనివారం ఆరా తీశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ గ్రామసభల్లో వచ్చిన వినతులు పరిశీలించారు. పాముదుర్తి, అగ్రహార, కొత్తకోట గ్రామాల రైతుల పెండింగ్, భూ సమస్యలు, కోర్టులో ఉన్న భూ సమస్యల రికార్డులు పరిశీలించారు. అలాగే మండలంలోని క్రిష్ణాపురంలో రహదారి సమస్య ఉండడంతో ఆ గ్రామానికెళ్లి రహదారిని పరిశీలించారు. ఇబ్బంది లేకుండా సమస్య పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఆమె వెంట తహసీల్దార్ షబుద్దీన్, డిప్యూటీ తహసీల్దార్ నరసింహులు, వీఆర్‌ఓలు ఉన్నారు.

### సమష్టిగా బాల్యవివాహాలను అరికడదాం

ధర్మవరంరూరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రభుత్వం కొత్తగా జీవో నెంబర్ 39ను తీసుకొచ్చిందని, అధికారులందరూ సమష్టిగా దాన్ని అమలు చేయాలని ధర్మవరం ఆర్డీఓ మహేష్ పేర్కొన్నారు. రాష్ట్ర బాల్య వివాహ నిరోధక చట్ట నిబంధనలు-2023పై శనివారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు బాల్యవివాహాలతో జరిగే అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసులు, డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, ఎంపీడీఓలు, సీఐలు, ఎస్ఐలు, సీడీపీఓలు పాల్గొన్నారు.

### పర్యావరణ పరిరక్షణపై అవగాహన

కదిరి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వివిధ పాఠశాలల్లో పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు ఎపీఎన్‌జీసి డైరెక్టర్ శ్రావంతి శనివారం అవగాహన కల్పించారు. స్థానిక బాలికల ఉన్నతపాఠశాల, బ్లూమూన్, వాల్మీకి పాఠశాలల విద్యార్థులతో ముఖాముఖి చర్చలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎన్‌జీసీ కో-ఆర్డినేటర్ మహేంద్రరెడ్డి, ఎంఈఓ ఓబుళరెడ్డి, మహేశ్వర్ బాబు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### 9 నుంచి క్రికెట్ టోర్నీ

కొత్తచెరువు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ పురస్కరించుకొని స్థానిక జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఈ నెల 9 నుంచి 19 వరకు మెగా క్రికెట్ టోర్నీని నిర్వహిస్తున్నట్లు మండల క్రికెట్ అసోసియన్ అధక్షుడు విజయ్ తెలిపారు. ఈ టోర్నీకి సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే సిధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి శనివారం స్థానిక జూనియర్ కళాశాలలో ఆవిష్కరించారు. విజయ్ మాట్లాడుతూ.. ఈ టోర్నీలో విజేతలకు రూ. 50 వేలు, రన్నర్స్‌కు రూ. 25 వేలతో పాటు ట్రోఫీని అందజేస్తామన్నారు. జట్ల పేర్ల నమోదుకు ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని, వివరాల కోసం భాస్కర్ బాబు సెల్ నెంబర్ 9908756785ను సంప్రదించాలని సూచించారు.

### ఆలయ నిర్మాణానికి ఆర్థిక సాయం

కదిరి, జనవరి 4(ఆంధ్రజ్యోతి) : తలుపుల మండలంలోని పెద్దన్నవారిపల్లిలో నిర్మిస్తున్న శ్రీకృష్ణ దేవాలయానికి కాంగ్రెస్ బీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నచ్చు బాలక్రిష్ణయాదవ్ రూ. పది వేల ఆర్థికసాయం అందించారు. శనివారం ఆ నగదును ఆ ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. అవసరమైతే మరింత సాయం అందచేస్తానని హామీ ఇచ్చారు.

### పిల్లల్లో ప్రతిభను గుర్తించండి

బుక్కపట్నం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): పిల్లల్లోని ప్రతిభను గుర్తించి.. వారిని ప్రోత్సహించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కౌసల్యసాయి సూచించారు. శనివారం స్థానిక మూడో అంగన్‌వాడీ సెంటర్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలు, పిల్లల తల్లులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పిల్లల్లో సృజనాత్మకత ఉంటేనే నేటి పోటీ ప్రపంచంలో రాణించగలరన్నారు. ఈకార్యక్రమంలో తెలుగు మహిళ అధ్యక్షురాలు లావన్యగౌడ్, మహిళ పోలీస్ విమల, అంగన్‌వాడీ కార్యకర్తలు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

## క్రైం న్యూస్ ..

### రూ.7లక్షలు స్వాహా చేసిన గ్రూపు లీడర్

కదిరి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అమీన్ నగర్‌లో నివాసముంటున్న ఖాజా-ఎ-గౌస్ డ్వాక్రా మహిళ సంఘం మొదటి లీడర్ గౌసీయా అలియాస్ సైద్‌మా గ్రూపునకు సంబంధించిన రూ. ఏడు లక్షలు స్వాహా చేసిందని, ఇందుకు ఆమె భర్త సిరాజ్ సహకరించారని కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐనారాయణరెడ్డి తెలిపారు. అమీన్‌నగర్‌లో ఉండే పది మంది మహిళలు డ్వాక్రా పొదుపు సంఘం ఏర్పాటు చేశారు. దానికి ఖాజా-ఎ-గౌస్ పేరు పెట్టుకున్నారు. దీనికి గౌసియా అనే మహిళను మొదటి లీడర్‌గా పెట్టుకున్నారు. సెప్టెంబరు 26వ తేదీన ఈ సంఘం వారందరూ కలిసి ఎస్‌బీఐ ఏడీబీ బ్యాంక్‌లో రూ. పది లక్షల రుణం తీసుకున్నారు. గ్రూపు సభ్యులందరూ క్రమం తప్పకుండా డబ్బులు చెల్లించారు. మొదటి లీడర్ గౌసీయా 9న నెలలపాటు వాయిదా సొమ్మును బ్యాంక్‌లో జమ చేసింది. ఆ తరువాత గ్రూపు సభ్యులు చెల్లించిన డబ్బును 16 నెలల పాటు బ్యాంక్‌లో జమ చేయలేదు. సభ్యులిచ్చిన కంతులు, వారి పొదుపు మొత్తం రూ.7లక్షలను సొంత అవసరాలకు వాడుకుంది. ఇందుకు ఆమె భర్త సిరాజ్ సహక రించారు. విషయం తెలుసుకున్న సంఘం సభ్యులు, రెండో లీడర్ మొగల్ నస్రీన్‌లు పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. దీంతో గౌసియా, ఆమె భర్త సిరాజ్‌లపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

### భర్త వేధింపులపై కేసు

కదిరి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని స్థానిక మశానంపేటలో ఉంటున్న సునీతను ఆమె భర్త మదన్‌మోహన్‌పై పోలీసులకు శనివారం ఫిర్యాదు చేసినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు. అమడగూరు మండలంలో టీచర్‌గా పని చేస్తున్న సునీతను గోరంట్ల మండలంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మధన్‌మోహన్ పెళ్లి చేసుకుని.. కదిరిలో నివాసమున్నారు. పెళ్లి అయినప్పటి నుంచి తనను భర్త, అత్త, మరిదులు అదనపు కట్నం కోసం వేధిస్తున్నట్లు సునీత పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో వారు కేసు నమోదు చేసుకున్నారు.

### జూదరుల అరెస్టు

గాండ్లపెంట, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లమీదపల్లి పంచాయతీలోని బనాయన్‌చెరువుపల్లి వద్ద పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు శనివారం ఏఎస్‌ఐ రంగా తెలిపారు. వారి వద్ద నుంచి రూ.27,380 నగదు, ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని.. కేసు నమోదు చేశామన్నారు.

### ఇసుక లారీ సీజ్

ఓబుళదేవరచెరువు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): కర్ణాటకకు 18 టన్నుల ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని శనివారం సీజ్ చేసినట్లు ఎస్‌ఐ టి. మల్లికార్జునరెడ్డి తెలిపారు. కడప జిల్లా గండివద్ద చెరువులోని ఇసుకను కర్ణాటకలో అధిక ధరకు అమ్ముకుని సొమ్ము చేసుకొంటున్నట్లు విచారణలో తేలిం ద న్నారు. లారీని సీజ్ చేసి, ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

## తోపుదుర్తి చందుపై ఫిర్యాదు


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

బత్తలపల్లి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత, ప్రస్తుత సీఎం చంద్రబాబు, ప్రస్తుత మంత్రి నారా లోకేష్‌ను రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్న తోపుదుర్తి చందు గతంలో అసభ్య పదజాలంతో తిట్టారని టీడీపీ నాయకులు అన్నారు. ఈ మేరకు శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ సోమశేఖర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ నాయకులు మాట్లాడుతూ.. 2022 నవంబరులో రాప్తాడు ఎంపీడీఓ కార్యాలయంలో చంద్రబాబు, నారా లోకేష్‌ను చంద్రు తీవ్ర పదజాలంతో దూషించాలని, ఆ వీడియోలు నేటికీ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయని అన్నారు. తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి, అతని అనుచరులపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు జిల్లా నాయకులు గంటాపురం జగ్గు, నారాయణరెడ్డి, సంగాలసూరి, సురేంద్ర పాల్గొన్నారు.

## సజావుగా మండల సమావేశం

కదిరి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): తలుపుల ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సజావుగా సాగింది. ఈ సమావేశానికి ఎంపీపీ రఫీనాయక్ అధ్యక్షతన నిర్వహించినట్లు ఎంపీడీఓ రామానాయక్ తెలిపారు. వివిధ శాఖల అధికారులు హాజరై, వారి వారి శాఖల ప్రగతిని వివరించారు. ఈ సమావేశంలో తలుపుల సర్పంచ్ శ్రీలత , ఎంపీటీసీలు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

## ఆలయాల్లో ఘనంగా ధనుర్మాస పూజలు



ప్రత్యేక అలంకరణలో కోట వెంకటేశ్వరస్వామి

మడకశిర టౌన్, జనవరి4(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వివిధ దేవాలయాల్లో శనివారం ధనుర్మాసాన్ని పురస్కరించుకొని విశేష పూజలు నిర్వహించారు. పట్టణంలోని కోట వెంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామివారికి విశేష అలంకరణ చేశారు. మిట్టబండ ఆంజనేయస్వామి ఆలయంలో స్వామి వారికి భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. చంద్రమౌళేశ్వరస్వామి, అభయ ఆంజనేయస్వామి, రామలింగేశ్వరస్వామి తదితర దేవాలయాల్లో సైతం ధనుర్మాస పూజలను ఘనంగా నిర్వహించారు. వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

## సీఎం చంద్రబాబు.. క్రైస్తవుల పక్షపాతి

పెనుకొండ, జనవరి 4(ఆంధ్రజ్యోతి): బడ్జెట్ సమావేశంలో క్రిస్టియన్ల సంక్షేమానికి రూ.150కోట్లు కేటాయించిన ముఖ్యమంత్రి చంద్రబాబు క్రైస్తవుల పక్షపాతి అని నిరూపించుకున్నాడని రాష్ట్ర క్రైస్తవ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామిదాస్, వైస్ ప్రెసిడెంట్ ఆంద్రోస్ హర్షం వ్యక్తం చేశారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి చేయలేని పనుల్ని సీఎం చంద్రబాబు చేశారన్నారు. ఇటీవల ముఖ్యమంత్రిని కలిసి వినతి పత్రం ఇచ్చామని, దీనిపై ముఖ్యమంత్రి స్పందించి ఉత్తర్వులు ఇవ్వడం హర్షణీయమన్నారు. క్రైస్తవులకు మరిన్ని సంక్షేమ పథకాలు అందిస్తారని ఆశిస్తున్నామన్నారు.

## సూపర్-6 పథకాలను అమలు చేయాలి

సోమందేపల్లి, జనవరి 4(ఆంధ్రజ్యోతి):సూపర్‌సిక్స్ పథకాలను కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు ఆవుల శేఖర్, కేశవరెడ్డిలు కోరారు. మండలకేంద్రంలోని సీపీఐ కార్యాలయం ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు ప్రసంగించారు. గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు నివేశన స్థలాలు ఇచ్చి నిర్మాణాలకు రూ.5లక్షలు పేదలకు అందించాలన్నారు. సూపర్‌సిక్స్‌లో భాగంగా ప్రతి మహిళకు రూ.1500, రైతులకు రూ.20వేలు, తల్లికి వందనం, ద్వారా కుటుంబంలో పిల్లలందరికీ రూ.15వేలు అందించాలన్నారు.

## పులేరు విద్యార్థినులకు ఘన సన్మానం



హర్షిత, కావ్యశ్రీని సన్మానిస్తున్న గ్రామస్థులు

గోరంట్ల, జనవరి4 (ఆంధ్రజ్యోతి): విద్యావైజ్ఞానిక ప్రదర్శనలో రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థినులు హర్షిత, కావ్యశ్రీలను స్థానిక ప్రజలు శనివారం ఘనంగా సన్మానించారు. మండలంలోని పులేరు ఉన్నత పాఠశాలలో చదువుతున్న వారు రూపొందించిన స్మార్టు ఎలక్ట్రికల్ సిస్టమ్ పుట్టపర్తిలో జరిగిన జిల్లాస్థాయి సైన్సు ఫెయిర్‌లో ఉత్తమ ప్రాజెక్టుగా ఎంపికైన విషయం తెలిసిందే. దీంతో వారికి, సైన్సు టీచర్ గంగాధరప్పకు అభినందనలు తెలిపారు. స్కూల్ కమిటీ చైర్మన్ జయపాల్‌యాదవ్, టీడీపీ నాయకులు హరి తదితరులు వారిని శాలువతో సత్కరించారు.

## రాష్ట్రస్థాయి సైన్స్‌ఫెయిర్‌కు ఎంపిక

పరిగి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి సంస్కృతి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం జరిగిన సైన్స్ ఫెయిర్‌లో ధనాపురం పాఠశాలకు చెందిన సైన్స్ ఉపాధ్యాయురాలు సుకన్య సుస్థిర పర్యావరణంపై ప్రదర్శన నిర్వహించారు. ఆమె ప్రదర్శన జిల్లాస్థాయి నుంచి రాష్ట్రస్థాయి సైన్స్‌ఫెయిర్‌కు ఎంపికైనందున డీఈఓ కిష్టప్ప జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందించారు. హెచ్‌ఎం జ్యోతిర్మయి, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

## ధర్మవరానికి తరలిన చేనేతలు



ధర్మవరానికి బయలుదేరిన చేనేతలు

సోమందేపల్లి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): సోమందేపల్లి మండల కేంద్రం నుంచి 20వాహనాల్లో శనివారం ధర్మవరం బయలుదేరి వెళ్లారు. కదిరి ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్‌కు జరిగే సన్మాన కార్యక్రమంలో పాల్గొనడానికి తరలి వెళ్తున్నట్లు నాయకులు డీసీ ఈశ్వరయ్య, సీసీ హరి, రంగనగోపాల్, కట్ట మహేంద్ర, చీల నారాయణస్వామి తెలిపారు.

## విద్యార్థులకు మోడల్ పేపర్స్ పంపిణీ



మోడల్ పేపర్స్ పంపిణీ చేస్తున్న మంత్రి

పెనుకొండ, జనవరి 4(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన పదో తరగతి మోడల్ పేపర్ బుక్స్ మంత్రి సవిత చేతుల మీదుగా పంపిణీ చేశారు. శనివారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత హాజరై విద్యార్థులకు మోడల్ పేపర్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ యూటీఎఫ్ సేవలను కొనియాడారు. 10వ తరగతి విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని దాతల సహకారంతో మోడల్ పేపర్స్ తయారు చేయించి విద్యార్థులకు ఉచితంగా అందజేయడం హర్షణీయమన్నారు. అనంతరం మంత్రిని ఉపాధ్యాయులను, యూటీఎఫ్ నాయకులు సత్కరించారు. ఎంఈఓలు చంద్రశేఖర్, సుధాకర్, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మడకశిర రింగ్ రోడ్డుకు మోక్షం కలిగేనా?



నడిరోడ్డులో నిలిచిపోయిన భారీ లారీ

- ఔటర్ రింగ్ రోడ్డుకు శాపంగా వైసీపీ పాలన
- 2018లో ప్రారంభించినా అతీగతీలేని నిర్మాణం
- ట్రాఫిక్ సమస్యతో పట్టణ ప్రజలు విలవిల

మడకశిర రూరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం కర్ణాటక సరిహద్దులో ఉన్న అత్యంత వెనుకబడిన ప్రాంతం. ప్రధానంగా ట్రాఫిక్ సమస్యతో మడకశిర పట్టణం సతమతమవుతోంది. జాతీయ రహదారి నుంచి భారీ వాహనాలు పట్టణం ద్వారా వెళ్లడమే ఇందుకు కారణమని నిపుణులు తేల్చారు. దీంతో భారీ వాహనాలు పట్టణంలోకి రాకుండా ఉండేందుకు, 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి సన్నాహాలు ప్రారంభించింది. పట్టణ సమీపంలోని మడకశిర, బుళ్ళసముద్రం, హారేసముద్రం, మల్లినాయకునిపల్లి, బేగార్లపల్లి మెళవాయి పంచాయితీల పరిధిలోని రైతులను ఒప్పించి రింగ్‌రోడ్డు కోసం 12 ఎకరాల భూములను సేకరించారు. బేగార్లపల్లి, రాళ్ళపల్లి అటవీ భూములు రింగ్ రోడ్డు కోసం తీసుకుని అందుకు సమానంగా ఇతర ప్రాంతాలలోని ప్రభుత్వ భూములను అటవీ శాఖకు అప్పగించారు. దీంతో రింగ్ రోడ్డు నిర్మాణానికి భూసేకరణ పూర్తయింది. అప్పటి జాయింట్ కలెక్టర్ భూషణ్ వచ్చి రింగ్ రోడ్డు కోసం సేకరించిన చీపులేటి సమీపంలోని భూములను, అందుకు సంబంధించిన స్కెచ్‌ను పరిశీలించారు. అత్యంత వెనుకబడిన మడకశిరను బాగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో టీడీపీ ప్రభుత్వం పట్టణానికి ఔటర్ రింగ్ రోడ్డును మంజూరు చేసింది. అందుకనుగుణంగా 2018లో రింగ్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజచేసి పనులను ప్రారంభించారు. హమ్మయ్య ఇక ట్రాఫిక్ సమస్యలేకుండా హాయిగా ఉందామనుకున్న ప్రజలకు ఆ ఆశ ఎంతోకాలం మిగలలేదు.



సేకరించిన భూముల స్కెచ్ పరిశీలిస్తున్న జేసీ (ఫైల్)

2019లో ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. ఇంకేముంది. మరింత వేగంగా జరుతాయనుకున్న ఔటర్ రింగ్ రోడ్డు పనులు ఆగిపోయాయి. పట్టణ ప్రజలకు నిరాశ మిగిలింది. వైసీపీ ఐదేళ్ల పాలనలో రింగ్ రోడ్డు పనులు అడుగుకూడా ముందుకు కదలలేదు. పట్టణ ప్రజలు వైసీపీ పాలనపై అసహనం వ్యక్తంచేశారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ ప్రభుత్వం కూలిపోయింది. మరలా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఇప్పుడైనా ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణ పనులు పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

### రింగ్ రోడ్డు నిర్మాణంతోనే పట్టణాభివృద్ధి



వీరాంజినప్ప, మడకశిర

ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం పూర్తయితేనే పట్టణం మరింత అభివృద్ధి చెందుతుంది. పట్టణ సమీపంలోని కొడికొండ నుంచి శిరకు వెళ్లే భారీ వాహనాలు పట్టణంలోకి రాకుండా వద్రపాళ్యం సమీపంలో పెనుకొండ రహదారిలోకి మళ్లిస్తే ట్రాఫిక్ తగ్గుతుంది. రోడ్లలో గుంతలు లేకుండాపోతాయి. పట్టణానికి రింగ్ రోడ్డు ఎంతో అవసరం.

## రోడ్లపై హోరెత్తిస్తున్న ఇసుక ట్రాక్టర్లు



రోడ్లపై బిజీబిజీగా ఇసుక ట్రాక్టర్లు

పెనుకొండ రూరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో ఇసుక బంగారంగా మారింది. గతంలో ఐదేళ్లపాటు సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు ఇంటి నిర్మాణం చేపట్టేందుకు నానా అవస్థలు పడేవారు. ఇసుక ట్రాక్టర్ రోడ్డుపైకి వచ్చిందంటే పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేసేవారు. దీంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఇసుక దొరక్క వేలకు వేలు ఖర్చుచేసి నాసిరకమైన ఇసుకతో భవన నిర్మాణం చేపట్టారు. వైసీపీ ప్రభుత్వం చేపట్టిన ఇసుక విధానం ప్రజల్లో ఆగ్రహం పెంచింది. దీంతో గత ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వాగుల్లో, వంకల్లో ఎక్కడైనా ఇసుకను ఉచితంగా తరలించుకోవచ్చని చెప్పగానే వైసీపీ హయాంలో మూలనపడ్డ ట్రాక్టర్లు ఇసుకను తరలిస్తూ రోడ్లపై హోరెత్తిస్తున్నాయి. పెనుకొండ నియోజకవర్గ వ్యాప్తంగా వెయ్యికి పైగా ట్రాక్టర్లు ఉన్నాయి. వైసీపీ హయాంలో ఒక టిప్పర్ ఇసుక రూ.25వేల నుంచి రూ.30వేల దాకా ఖర్చుచేసి ఇంటి నిర్మాణానికి తరలించేవారు. కూటమి ప్రభుత్వం కొలువు తీరగానే ఉచిత ఇసుక విధానం అమలుచేయగానే నాణ్యమైన ఇసుక ట్రాక్టర్ రూ.1600నుంచి రూ.1800కు లభిస్తోంది. ట్రాక్టర్ల డ్రైవర్లు, కూలీలు, భవన నిర్మాణ కార్మికులకు తిరిగి ఉపాధి కల్పన లభిస్తోందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**వైసీపీ హయాంలో ట్రాక్టర్లు మూలనపడ్డాయి : సాయి, గోనిపేట**

ఎవరైనా భవన నిర్మాణదారులు ఇసుక తరలించాలని ఫోన్‌చేస్తే వైసీపీ హయాంలో భయంభయంగా ఇసుకను తరలించేవారం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే స్వచ్ఛందంగా పగలే ఇసుకను భవన నిర్మాణాలకు తరలిస్తున్నాం. కూటమి ప్రభుత్వం రాగానే పొట్టనిండా అన్నం తింటున్నాం.

## రైతు సేవాకేంద్రాల ఇన్‌చార్జిల పనితీరుపై విచారణ

గోరంట్ల, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో పనిచేస్తున్న గ్రామస్థాయి అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలపై పెనుకొండ అగ్రికల్చర్ ఏడిఏ స్వయంప్రభ శనివారం విచారణ నిర్వహించారు. గోరంట్లలోని అగ్రికల్చర్ కార్యాలయంలో ఉదయం 11గంటలనుంచి సాయంత్ర 5.30గంటలవరకు అధికారులను విచారించారు.



విచారణ చేస్తున్న ఏడీఏ స్వయంప్రభ

ఆర్‌ఎస్కే ఇన్‌చార్జిలు నెలతరబడి సెలవులు పెడుతూ ప్రతినెల వేతనాలు డ్రా చేయడమేకాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలపై గత యేడాది డిసెంబర్ 9న ఇష్టారాజ్యం అన్న శీర్షికతో కథనం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. దీనిపై స్పందించిన జిల్లా వ్యవసాయాధికారి పెనుకొండ ఏడిఏ స్వయంప్రభను విచారణాధికారిగా నియమించడంతో ఆమె పరిశీలన కోసం వచ్చారు. హిందూపురం ఏడి సురేష్ ఆధ్వర్యంలో ఏఓ మునిక్రిష్ణ, గంగంపల్లి, గౌనివారిపల్లి సిరికల్చర్ అసిస్టెంట్లు నారాయణస్వామి, కుమార్‌లను విచారించారు. నారాయణస్వామి గత యేడాది 92రోజులు సెలవులో వెళ్లడంతో ఈక్రాప్ బుక్కింగ్‌కు అంతరాయం ఏర్పడిందని, ప్రస్తుతం డిసెంబర్ 5నుంచి మళ్లీ ఉన్నత పరీక్షలకు సిద్ధం కావడానికి 80రోజుల సెలవులో వెళ్లడంతో ఆయనను విచారణకు పిలిపించారు. సెలవు రోజుల్లో జీతం డ్రా చేశారన్న విషయంపై ఎంపీడీఓ నరేంద్ర కుమార్‌ను ఏడీఏ విచారించారు. విచారణకు సంబంధించి, సంబంధితాధికారులతో లిఖితపూర్వక వివరణ తీసుకుంటూ, రికార్డులను ఆమె తనిఖీ చేశారు. అలాగే వడిగేపల్లి సిరికల్చర్ అసిస్టెంట్ దీప ఈపంట నమోదులో అవకతవలకు పాల్పడ్డారని స్థానిక ప్రజాప్రతినిధులు ఆరోపిస్తున్నారు. అక్టోబరు 13నుంచి నవంబరు 15వరకు 44రోజులు సెలవులో వెళ్లి, ఆర్‌ఎస్కేలోని రూ. 2.60లక్షల విలువ చేసే కాంప్లెక్సు ఎరువులు, రాగి విత్తనాలు తన కస్టడీలో ఉంచుకోవడంతో రైతులకు పంపిణీ చేయడానికి వీలుపడలేదు. తరువాత విధులకు సరిగా రాకపోవడం, ఉద్యోగానికి రాజీనామా చేయడం, మళ్లీ ఆమె నిర్ణయం ఉపసంహరించుకోవడం తెలిసిందే. విచారణ జరపడానికి సిరికల్చర్ అసిస్టెంట్ దీపను పిలిపించడం కోసం అధికారులు ప్రయత్నించగా, ఆమె అందుబాటులోకి రాలేదు. దీంతో మరోసారి ఆమెను కార్యాలయానికి పిలిపించి విచారణ చేపడతామని ఏడిఏ స్వయంప్రభ తెలిపారు.

## ఘనంగా బ్రెయిలీ జయంతి



బ్రెయిలీ జయంతి సందర్భంగా కేక్ కట్‌చేస్తున్న దివ్యాంగులు

అగళి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): అంధుల లిపి సృష్టికర్త లూయీ బ్రెయిలీ జయంతి వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో దివ్యాంగుల పాఠశాల సిబ్బంది చైతన్య, తిప్పేస్వామి ఆధ్వర్యంలో కార్యక్రమం జరుపుకున్నారు. అనంతరం కేక్‌కట్‌చేసి స్వీట్లు పంచుకున్నారు. కార్యక్రమంలో దివ్యాంగులు, తల్లిదండ్రులు, ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సోమందేపల్లి: సోమందేపల్లిలోని భవిత కేంద్రంలో శనివారం బ్రెయిలీడేను ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం లక్ష్మీబాయి మాట్లాడుతూ బ్రెయిలీ డే ప్రత్యేకతను వివరించారు.

పెనుకొండ రూరల్ : రొద్దంలో టింబక్టివ్ కలెక్టివ్ సంస్థ సహకారంతో ప్రతిభ వికలాంగుల సొసైటీ ఆధ్వర్యంలో లూయీ బ్రెయిలీ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో టింబక్టివ్ కలెక్టివ్ సంస్థ డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రొళ్ల : రొళ్ల మండలంలో ఎంపీపీ పాఠశాలలోని కార్యాలయంలో లూయీ బ్రయిలీడే పురస్కరించుకొని సరస్వతీ మాత చిత్రపటానికి హెచ్‌ఎం తిమ్మరాజు, ఎంఈఓ శ్రీధర్ పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు.



రొద్దంలో బ్రెయిలీ జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

## విద్యార్థులకు వరం.. మధ్యాహ్న భోజనం

లేపాక్షి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నుంచి కూటమి ప్రభుత్వం మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేసింది. ప్రభుత్వ పాఠశాలలో మాదిరిగానే కళాశాలలో కూడా ఈ పథకం అమలు చేసింది. ఇది ఇంటర్ విద్యార్థుల పాలిట వరమని మండల కన్వీనర్ జయప్ప అన్నారు. 2018లోనే అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకం అమలు చేసిందని 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ సర్కారు దీనిని నిలిపివేయడంతో విద్యార్థులకు కష్టాలు మొదలయ్యాయన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ నాగరాజునాయక్, మాజీ ఎంపీపీ ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

**విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం**



విద్యార్థులకు భోజనాన్ని వడ్డిస్తున్న టీడీపీ నాయకులు

చిలమత్తూరు: విద్యార్థుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ రంగారెడ్డి, దేమకేతేపల్లి అంజినప్ప, బాలాజీ, అశ్వర్థప్ప, సోమశేఖర్, జనసేన నాయకులు చిన్న ప్రవీణ్ తదితరులు విద్యార్థులకు భోజనం వడ్డించారు.

గుడిబండ: పేద విద్యార్థుల ఆకలి తీర్చడానికే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కూటమి ప్రభుత్వం డొక్కసీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టారని టీడీపీ మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, ఎంపీడీఓ గంగాధర్‌లు పేర్కొన్నారు. శనివారం గుడిబండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపల్ యశ్వంత్‌కుమార్, టీడీపీ నాయకులు ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మంజునాథ్, నాయకులు శివకుమార్, దుర్గేష్ పాల్గొన్నారు.

## ఇరుముడి కట్టి.. శ్రీవారి మెట్టుకు..



ఇరుముడి ధరించి తిరుమలకు బయలుదేరి వెళుతున్న ఎమ్మెల్యే

మడకశిరటౌన్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): గోవిందమాల ధరించిన టీటీడీ బోర్డు సభ్యులు, ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు శనివారం ఇరుముడితో తిరుమలకు బయలుదేరారు. గోవిందమాల ధరించిన ఇతర భక్తులతో కలిసి శ్రీవారి మెట్ల మార్గంలో స్వామివారి దర్శనం కోసం కాలినడకన వెళ్లారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని, వర్షాలు పుష్కలంగా కురవాలని, వెంకటేశ్వరస్వామిని ప్రత్యేకంగా కోరుకున్నట్లు తెలిపారు.

## తాగునీటి సమస్య పరిష్కారం



తాగునీటి బోరును ప్రారంభిస్తున్న మంత్రి సవిత

పెనుకొండ రూరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): రొద్దం మండలం బీసీ కాలనీలో తాగునీటి సమస్యను బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పరిష్కరించారు. రొద్దం బీసీ కాలనీలో కొన్నేళ్లుగా తాగునీటి సమస్య ఉందని విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె స్పందించి కాలనీలో బోరు వేయించారు. తాగునీటి బోరును శనివారం మంత్రి ప్రారంభించడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

## శంఖారావం సభకు ప్రత్యేక రైలులో..



ఆహార పొట్లాలు అందజేస్తున్న మంత్రి సవిత

హిందూపురం అర్బన్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): నేడు విజయవాడలో జరుగనున్న హైందవ శంఖారావ సభకు హిందూబంధువులు లక్షలాదిగా తరలి వెళ్లారు. ముందస్తుగా ఎక్కువ మంది రిజర్వేషన్ చేయించుకోవడంతో భారత రైల్వేశాఖ వారి కోసం ప్రత్యేక రైలును ఏర్పాటు చేసింది. దీంతో దాదాపుగా రెండు వేల మంది ప్రత్యేక రైలులో విజయవాడ శంఖారావ సభకు బయలు దేరారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సోదరులు సభకు బయలు దేరిన వారికి అన్న పానీయాలు అందించారు.

**ఆహార పొట్లాలు అందజేసిన మంత్రి**

పెనుకొండ టౌన్, పెనుకొండ: పెద్దఎత్తున హైందవ శంఖారావం కార్యక్రమానికి పెనుకొండ నుంచి విజయవాడకు తరలి వెళ్తున్న హిందువులకు బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత నీరు, ఆహారం అందించి సాగనంపారు. విశ్వహిందూపరిషత్ ప్రఖండ్ అధ్యక్షుడు వేదవ్యాస ఆధ్వర్యంలో ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి బయలుదేరి వెళ్లారు. వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ఆదివారం గన్నవరం విమానాశ్రయం కేసరపల్లి వద్ద లక్షలాది మందితో దేవాలయాల రక్షణ కోసం సభ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

## బసవనపల్లిలో మౌలిక సదుపాయాలపై గ్రామసభ

అమరాపురం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): అమరాపురం మండల పరిధిలోని బసవనపల్లి గ్రామంలో మౌలిక సదుపాయాలు, పరిశుభ్రతపై గ్రామ సభ నిర్వహించారు. స్థానిక సర్పంచి భాగ్యమ్మ, నరసింహప్ప, పంచాయతీ కార్యదర్శి మనోహర్‌శర్మ ఆధ్వర్యంలో ఈగ్రామసభను నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్య, విద్యుత్ దీపాలు, డ్రైనేజీ సౌకర్యం సక్రమంగా అమలు చేయాలని గ్రామస్తులు కోరారు.

క్రైం కార్నర్

## జూదరుల అరెస్టు.. రూ.65 వేల స్వాధీనం

సోమందేపల్లి, జనవరి 4(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని రూకలపల్లి శివారులో జూదమాడుతున్న ఆరుగురిని అరెస్ట్‌చేసి వారి నుంచి రూ.65వేలు నగదును, రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. రూకలపల్లి వద్ద జూదమాడుతున్నారన్న సమాచారంతో పోలీసులు వారిపై దాడిచేశారు. ఈ దిశలో హిందూపురానికి చెందిన ఏడుగురు, పరిగికి చెందిన ఇద్దరు, మొత్తం 9మంది పోలీసులకు చిక్కారు. ఇందులో ముగ్గురు పారిపోగా ఆరుమందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి నగదు, బైక్‌ను స్వాదీనం చేసుకుని కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

## చిరు వ్యాపారుల మధ్య గొడవ

సోమందేపల్లి, జనవరి 4(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని వాల్మీకి సర్కిల్‌లో చిరువ్యాపారుల మధ్య శనివారం గొడవ జరిగింది. ఈ వివాదం తారాస్థాయికి చేరడంతో వడల వ్యాపారి శనిక్కాయాలు అమ్ముకునే మరో వ్యాపారి కుటుంబంపై కాగుతున్న నూనె పోయడంతో ఐదుగురు గాయపడిన సంఘటన చోటుచేసుకుంది. వాల్మీకి సర్కిల్‌లో గత కొంతకాలంగా మల్లాపల్లి కాసీంసాబ్ అతని కుమార్తె వడలు అమ్ముకుని జీవిస్తున్నాడు. అదేవిధంగా పక్కన మరో వ్యాపారి వేరుశనగలు అమ్ముకుంటున్నాడు.. ఇటీవల మంత్రి సవితమ్మ స్థానికుల కోసం పట్టణంలోని అన్ని సర్కిళ్లలో సిమెంటు కుర్చీలు ఏర్పాటు చేయించారు. అయితే సిమెంటు కుర్చీలు కావాలనే తమకు అడ్డుగా వేయించారని ఆగ్రహించిన ఖాసీంసాబ్ వేరుశనగలు అమ్ముకుంటున్న నాగలక్ష్మీతో గొడవకు దిగారు. కాగుతున్న వడల నూనెను నాగలక్ష్మీ, ఆమె బంధువులపైకి విసిరాడు. ఈ గొడవలో నాగలక్ష్మీ, బంధువులు డీలర్ రమేష్, హేమంత్, రమణ, అనీల్, నాగరత్నలు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై ఎస్‌ఐ రమేష్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రాజస్థాన్ వ్యాపారిపై దాడి



గాయపడ్డ వ్యాపారి

హిందూపురం అర్బన్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): రాజస్థాన్‌కు చెందిన వ్యాపారి కాంతిలాల్‌పై గుర్తు తెలియని దుండగులు దాడి చేసి గాయపరిచారు. హిందూపురంలో రాత్రి 10 గంటలకు షాపులన్నీ మూతవేయాలని పోలీసులు నిబంధనలు విధించారు. వారి ఆదేశాల మేరకు కాంతిలాల్ శుక్రవారం రాత్రి 9.50 షాపు మూసివేసి ఇంటి వెళ్తున్నాడు. 10 గంటల సమయంలో ఎన్టీఆర్ సర్కిల్‌లో ముగ్గురు దుండగులు రోడ్డు పక్కన వెళ్తున అతన్ని అటకాయించి అమానుషంగా దాడి చేసి గాయపరిచారు. పిడిగుద్దుల దాడిలో అతని ఎడమ కన్ను దెబ్బతింది. ఆయన తెలిపిన మేరకు వారు జిమ్ నుంచి వచ్చినట్లు తెలుస్తుందన్నారు. దాడికి ఎందుకు పాల్పడ్డారు?ఎవరనేది పోలీసులు సమీపంలోని సీసీ కెమెరాల ఆదారంగా దాడి చేసిన వారిని గుర్తించి అదుపులోకి తీసుకోవాల్సి ఉంది. అయితే ఇలాంటి దాడులు రెండువారాల్లో నాలుగవ ఘటనగా తెలుస్తుంది. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా పోలీసులు గట్టి చర్యలు తీసుకోవాల్సి ఉంది. వన్‌టౌన్ సీఐ రాజగోపాలనాయుడు మాట్లాడుతూ ఈ ఘటనపై కేసు నమోదు చేశామని విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.